ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 9 నవంబరు 2025


చుక్కనీరు లేక వెలవెలబోతున్న ఊటుకూరు చెరువు

చెరవు

● కబ్జా కోరల్లో ఊటుకూరు చెరువు

- 150 ఎకరాలకు పైబడి ఆక్రమణ
- మామిడి, అరటి, బొప్పాయి పంటల సాగు
- వరదనీటి కాలువనూ వదల్లేదు...
- చుక్కనీరు లేక చెరువు అంతా ఖాళీ
- ఆయకట్టంతా బీడుగానే...


కాలువ ఆనవాళ్లు లేకుండా చేసి సాగు చేస్తున్న పంటలు


చెరువును ఆక్రమించి సాగు చేస్తున్న పంటలు

రాజంపేట పట్టణానికి ఆనుకుని ఉన్న ఊటుకూరు చెరువు కబ్జాదారుల కబంధహస్తాల్లో చిక్కుకుని చిన్నదైంది. చెరువును కబ్జా చేసి దర్జాగా మామిడి, అరటి తోటలు సాగు చేస్తున్నా అధికారులకు ఇది కనిపించకపోవడం గమనార్హం. ఈ చెరువు కింద 550 ఎకరాల ఆయకట్టు ఉంది. కొండల్లో నుంచి చెరువుకు నీరు వచ్చే కాలువను కూడా కబ్జా చేయడంతో చెరువులోకి నీరు రావడం లేదు. అన్నమయ్య ప్రాజెక్టు నుంచి నీరు వచ్చే కాలువ కూడా కొట్టుకుపోవడంతో చెరువుకు నీరు వచ్చే ఆస్కారమే లేకుండాపోయింది. దీంతో కబ్జాదారులు చెరువు భూమిలో మామిడి, అరటి, బొప్పాయి, ఇతర పంటలను దర్జాగా పండిస్తున్నారు.

రాజంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణానికి కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలో ఈ చెరువు ఉంది. ఈ చెరువుకు నీరు వస్తే ఊటుకూరు, భువనగిరి పల్లె, కొండ్లోపల్లె, రాజంపేట, వెంకటరాజంపేట తదితర పది గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందుతుంది. అటువంటి చెరువును పదేళ్ల నుంచి కబ్జాదారులు పూర్తిగా ఆక్రమించేశారు. చెరువులో దాదాపు 150 ఎకరాల వరకు ఆక్రమించేశారు. ఆయకట్టు రైతులు కాకుండా ఎగువ ప్రాంతాల్లో పుల్లంపేట మండలానికి సంబంధించిన కొన్ని గ్రామాల వారు చెరువును ఆనుకుని ఎగువ వైపు ఉన్నారు. వీరికి చెరువు కింద ఆయకట్టు భూమి లేదు. అందువల్ల చెరువులో ఉన్న మట్టి ఎగువ ప్రాంతంలోని చెరువులోనే వేసుకుని ఎత్తుగా వ్యవసాయ యోగ్యంగా మార్చుకుని మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ తదితర పంటలను దర్జాగా సాగు చేసుకుంటున్నారు. ఏకంగా చెరువునే ఆక్రమించి వంద ఎకరాలకు పైబడి సాగు చేసుకుంటున్నా పట్టించుకునేవారు లేరు. సాగునీటి సంఘాలు కూడా కేవలం అలంకారప్రాయంగా మారాయి. ఇందుకు సంబంధించిన నీటి పారుదల శాఖాధికారులు కూడా చూసీ చూడనట్లు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ ఆక్రమణలు రెట్టింపు అయ్యాయి. గత ఐదేళ్లలో చెరువును వంద ఎకరాల నుంచి 150 ఎకరాల వరకు ఆక్రమించి చెరువులో ఉన్న మట్టిని తీసి ఆ మట్టితోనే ఎగువనున్న చెరువును పూడ్చి వేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. చెరువుకు తిరుమల గిరుల నుంచి నీరు వచ్చే ప్రధాన కాలువ పూర్తిగా పూడ్చివేశారు. వత్తలూరు, అనాసముద్రం, ఎగువ ప్రాంతాల్లోని తిరుమల గిరుల్లో కురిసే వర్షపునీరు అనేక చెరువుల ద్వారా ఊటుకూరు చెరువుకు వస్తుంది. ఈ వర్షపునీటితో చెరువు నిండుతుంది. ప్రస్తుతం ఆ కాలువను పూర్తిగా పూడ్చి వేశారు. కాలువను పూడ్చివేసి చెరువులోకి నీరు రాకుండా పంటలు పండిస్తున్నారు. అన్నమయ్య ప్రాజెక్టు నుంచి ఈ చెరువుకు ప్రత్యేక కాలువను ఏర్పాటు చేశారు. చెరువు పుట్టినప్పటి నుంచి ఉన్న కాలువను పూడ్చి వేసి పంటలు సాగు చేసినా 20 ఏళ్ల కిందట అన్నమయ్య ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు చేసిన కాలువ నుంచి వచ్చే నీటితో చెరువు నిండేది. ప్రస్తుతం ఆ కాలువ కూడా కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు నీరు రాకుండాపోయింది. దీనివల్ల ప్రస్తుతం భారీ వర్షాలు కురిసినా ఊటుకూరు చెరువులోకి చుక్కనీరు రాకుండా పోయింది. దీని వల్ల చెరువు ఎడారిని తలపిస్తోంది. దీనివల్ల చెరువు ఆయకట్టు భూమి అంతా బీడుగా మారిపోయింది. ఊటుకూరు చెరువు ఆయకట్టు రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువుకు నీరు అందించే కాలువను పునరుద్ధరించి చెరువులోని ఆక్రమణలను తొలగించి వచ్చే ఏడాది వర్షాకాలంలోనైనా చెరువుకు నీరు అందించి ఆయకట్టు సాగయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


చెరువులో సాగవుతున్న అరటి

ఆక్రమణలను తొలగించాలి



ఊటుకూరు చెరువు సుమారు 100 నుంచి 150 ఎకరాల భూమిని ఆక్రమించేశారు. చెరువునే ఆక్రమించి దర్జాగా అరటి, బొప్పాయి, ఇతర పంటలను సాగు చేసుకుంటున్నారు. తిరుమల కొండల నుంచి వత్తలూరు చెరువు ద్వారా వచ్చే నీటి కాలువను కూడా ఆక్రమించడంతో చెరువుకు చుక్కనీరు అందడం లేదు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడం వల్ల ప్రాజెక్టు నుంచి కూడా చుక్కనీరు రావడం లేదు. చెరువుకు నీరు అందించే రెండు కాలువలు లేకపోవడంతో వర్షాలు పడినా చెరువుకు నీరు అందే పరిస్థితి లేదు. దీనివల్ల ఆయకట్టు భూమి పండక బీడుగా మారిపోయింది. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- నామా హరినాథ్ రాయల్, చెరువు సంఘం అధ్యక్షుడు, ఊటుకూరు


చుక్కనీరు లేక ఆయకట్టంతా బీడే



ఊటుకూరు చెరువులో చుక్కనీరు లేకపోవడంతో ఆయకట్టు భూమి బీడుగా మారిపోయింది. మొత్తం ఆయకట్టు అంతా వరి, ఇతర పంటలు పండేవి. అన్నమయ్య ప్రాజెక్టు కాలువ నిరుపయోగంగా ఉంది. గతంలో ఉన్న కాలువను కూడా ఆక్రమించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఊటుకూరు చెరువులో ఉన్న ఆక్రమణలను తొలగించాలి. లేదంటే ఈ ప్రాంత రైతులు ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

- మలిశెట్టి పాండురంగయ్య, ఊటుకూరు రాజంపేట

12న చిన్నమండెంకు సీఎం చంద్రబాబు రాక?



చిన్నమండెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 12వ తేదీ బుధవారం చిన్నమండెం మండలానికి వస్తున్నట్లు అధికారుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. గత నెల 29వ తేదీ పేదలందరికీ ఇళ్లు, గృహ ప్రవేశ వేడుకల కార్యక్రమానికి రావాల్సి ఉండగా మొంథా తుఫాన్ కారణంగా పర్యటన వాయిదా పడింది. అప్పటి నుంచి జిల్లా యంత్రాంగం ముఖ్యమంత్రి పర్యటనకు పనులు చేస్తున్నారు. కడప-బెంగళూరు జాతీయ రహదారి ఆనుకుని దేవపట్ల క్రాస్ రోడ్డు వద్ద హెలిప్యాడ్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనకాల గృహ ప్రవేశ వేడుకలు, బాపూజీ నగర్‌కాలనీ వద్ద బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ 12వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్నమండెం పర్యటనకు వస్తారని అధికారులు, నాయకులు చర్చించుకుంటున్నారు.

మిలటరీ మద్యం ముసుగులో
అక్రమ రవాణా 6

పీలేరు రైతు బేజారు... 6

గ్రైండర్‌లో పడి మహిళ మృతి 6

భక్త కనకదాస సేవలు ఆదర్శనీయం

కోదండరాముడికి స్నపన తిరుమంజనం


సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ అధికారి

ఒంటిమిట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, విజిలెన్స్ అధికారి గంగులయ్య సుగంధ ద్రవ్యాలను, పట్టు వస్త్రాలను, పుష్పాలను ఆలయ అర్చకులకు అందజేశారు. అర్చకులు స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం శనివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారి అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం చేసి... దాచేందుకు యత్నం...

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న పీటీఎం ఎస్‌ఐ కారు
- శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పరిస్థితి విషమం
- నెంబర్ ప్లేట్ పీకేసి రహస్యంగా కల్యాణమండపంలోకి తరలింపు


తీవ్రంగా గాయపడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుల్తాన్


కల్యాణమండపంలో ఉంచిన కారు


కారుకు తొలగించిన నెంబర్ ప్లేటు

ములకలచెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండల ఎస్‌ఐ హరిహరప్రసాద్ కారు ఢీకొని ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని ములకలచెరువు మండలం పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని తన కారుకు ఉన్న నెంబర్ ప్లేట్లను తీసేసి ములకలచెరువులోని ఓ కల్యాణమండపంలో దాచారు. కారుకు ఇన్సూరెన్సు కూడా లేకపోవడంతో కేసు నమోదైతే మరో కారు పెట్టేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు....

బి.కొత్తకోట మండలం గుడిసివారిపల్లెలో జరిగిన యువకుడు జయప్రకాశ్‌రెడ్డి హత్య కేసు నిందితులను పట్టుకునేందుకు పోలీసు అధికారులు పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్‌కి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన తన కారులో నిందితుల కోసం తుమ్మణంగుట్ట పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్‌ఐ కారు మరమ్మతులకు గురి కావడంతో కానిస్టేబుల్ మౌలాలికి ఇచ్చి ములకలచెరువుకు పంపాడు. ఇక్కడ కారుకు మరమ్మతులు చేయించి ఎస్‌ఐ ఉన్న తుమ్మణంగుట్టకు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో ములకలచెరువు మండలం పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై శుక్రవారం రాత్రి ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా అమడగూరు మండలం మహమ్మదాబాద్‌కు చెందిన సుల్తాన్ (26) తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ యువకుడిని 15 నిమిషాల తరువాత వచ్చిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి పంపారు. బాధితుడిని ఆస్పత్రికి సకాలంలో తరలించడంలో ఆలస్యం వహించడంపై విమర్శలు విన్పిస్తున్నాయి. అనంతరం ఎస్‌ఐ తన కారుకు ముందు, వెనుక ఉన్న నెంబర్ ప్లేట్లను తొలగించారు. అంతటితో ఆగకుండా కారును తీసుకెళ్లి ఓ కల్యాణమంపడంలో దాచారు. కారు నెంబర్ ప్లేట్లు తొలగించడంతో ముందు భాగంలో మరో నెంబర్ ఉంది. దీంతో కారు అసలు నెంబర్ ఏమిటో అర్థం కావడం లేదు. అలాగే కారుకు ఇన్సూరెన్సు లేకపోవడంతో మార్చేందుకు యత్నిస్తున్నారని తెలిసింది. కాగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ యువకుడి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. ఎక్కడైనా ప్రమాదాలు, చోరీలు తదితర సంఘటనలు జరిగితే తాము వచ్చే వరకు సంఘటనా స్థలిలోకి ఎవరినీ పోలీసులు ఎవరిని వెళ్లనీయరు. ఎవరైనా వెళితే చర్యలు తీసుకుంటారు. అలాంటిది రోడ్డు ప్రమాదానికి కారణమైన తన కారును సంఘటనా స్థలం నుంచి తీసుకెళ్లి దాచడం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై సీఐ వెంకటేశులును వివరణ కోరగా ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, గాయపడ్డ బాధితుడిని మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించామని, ప్రమాదంపై విచారణ చేస్తున్నామని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

కొమ్మ ఎందుకు.. చెట్టే కోసేస్తే పోలా?

- అడ్డం పేరుతో అడ్డు తొలగిస్తున్నారు
- పట్టణంలో యథేచ్ఛగా చెట్లు కొట్టివేత
- కనికరం చూపని కరెంటోళ్లు


ఎన్‌వీఆర్ లేఅవుట్‌లోని పార్కు ముందు నేలకొరిగిన చెట్టు కొమ్మలు


మున్సిపల్ కార్యాలయం ముందు


ఫైర్‌స్టేషన్ వెళ్లే మార్గంలో సగానికి కోసేసిన చెట్టు

మదనపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం వచ్చిందంటే చాలు పట్టణంలో ఎక్కడ చూసినా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ లైన్లకు చెట్లు, కొమ్మలు అడ్డం పేరుతో అడ్డు తొలగిస్తున్నారు. ఇంతకాలం కొడవలితో చెట్ల కొమ్మలను నరికేయగా, తాజాగా మొదలుతో సహా రంపంతో కోసేస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులతో పాటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పర్యావరణ ప్రేమికులు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, కరెంటోళ్లపై కన్నెర్ర చేస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కడిక్కడ ట్రాన్స్‌కో సిబ్బందిని అడ్డుకుంటున్నా పనికానిస్తుండటంపై వారిపై పెదవి విరుస్తున్నారు. మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ నినాదాలు, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే అధికారులు, నాయకులు వీటికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి మున్సిపాలిటీ అనేక చర్యలు చేపడుతోంది. వర్షాకాలంలో నెలలో ప్రతి శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో 20 వేల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా ఇప్పటికీ కొనసాగుతోంది. అలాగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో కూడా మొక్కలు నాటి, సంరక్షించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఓ పక్క మున్సిపాలిటీ, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (అపెక్స్) వేల రూపాయలు వెచ్చించి పట్టణంలో మొక్కలు నాటుతుండగా, ట్రాన్స్‌కో అధికారులు మరోపక్క చెట్లను తొలగిస్తున్నారు.

ప్రతి రెండో శనివారం ఉదయం 9 గంటలకు నుంచి మధ్యాహ్నం 12 గంటలు లేదా ఒంటిగంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల మరమ్మతు పేరుతో సరఫరా ఉండదని ముందస్తు ప్రకటన చేస్తున్నారు. విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని, దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు బర్న్ అవుతూ ట్రిప్పు అవుతున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ స్పెషల్ డ్రైవ్ పేరుతో పచ్చదనాన్ని పాడు చేస్తున్నారు. లైన్లకు తగిలే, రాసుకునే కొమ్మలను తొలగిస్తే ఇబ్బంది లేదు కానీ, మొదటికే చెట్టును లేకుండా చేయడాన్ని స్థానికులు జీర్ణించుకోలేకపోతున్నారు. పచ్చదనానికి, ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా చెబుతున్న మదనపల్లెలో ఇదే పరిస్థితి కొనసాగితే, కనీసం రానున్న ఎండాకాలంలో తల దాచుకోవడానికి నీడ కూడా ఉండదని నిట్టూరుస్తున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం లోపల, బయట, ఆర్‌అండ్‌బీ రోడ్డు, మోతీనగర్, ఎన్‌వీర్ లేఅవుట్, సొసైటీ కాలనీ, నీరుగట్టువారిపల్లె, రెడ్డెప్పనాయుడు, కమ్మగడ్డవీధి విస్తరణ ఏరియా, రోజా ప్లాట్స్, తదితర ప్రాంతాల్లో చెట్లు నరికేస్తున్న జాబితాలో ఉంటున్నాయి.


రాజీవ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో..

హస్తకళలకు ప్రోత్సాహం

- జిల్లా అటవీ శాఖాధికారి జగన్నాథ్‌సింగ్


రైల్వేకోడూరు మండలంలోని లక్ష్మీగారిపల్లెలో కళాకారులు తయారు చేసిన కొయ్య బొమ్మను పరిశీలిస్తున్న జగన్నాథ్‌సింగ్

రైల్వేకోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హస్తకళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా అటవీ శాఖాధికారి జగన్నాథ్‌సింగ్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు మండలం లక్ష్మీగారిపల్లెలోని కొయ్య బొమ్మల తయారీ కేంద్రంలో కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉత్పత్తి సవాళ్లు, ముడి సరుకు అందుబాటులో వంటి అంశాలను కళాకారుల నుంచి సమగ్రంగా తెలుసుకున్నామని తెలిపారు. అడవిపై ఆధారపడకుండా స్వయం ఉపాధి సాధించేందుకు కళాకారులకు అవసరమైన అవకాశాలు, శిక్షణ, ప్రత్యామ్నాయ వనరులు అందించేందుకు అటవీశాఖ నిర్ణయించిందన్నారు. అంతరించిపోతున్న కొయ్య బొమ్మల కళాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆధునిక శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక మార్గదర్శకాలు, డిజైన్ అభివృద్ధికి సంబంధించిన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళాకారులకు ఆర్థిక, సామాజిక సహకారం అందించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పథకాలు చేరవేయాలని ప్రకటించారు. రాజు, రాణి బొమ్మల తయారీకి అవసరమైన కొయ్య సరఫరాకు తగు సూచనలు చేశామని తెలిపారు. రాజు, రాణి బొమ్మలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తే కళాకారులకు ఆర్థిక సౌలభ్యం కలుగుతుందన్నారు. రాజు, రాణి కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. లక్ష్మీగారిపల్లెలోని సీఎఫ్‌సీ సెంటర్‌లో వుడ్ డిపో లైసెన్సు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలించారు. కార్యక్రమంలో లక్ష్మీ వెంకటేశ్వర ఆర్టిస్ట్స్, ఉడెన్ టాయ్స్ మేకర్స్ అసోసియేషన్ సభ్యులు, లక్ష్మీగారిపల్లె కొయ్య బొమ్మల కళాకారులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ మద్యం ముసుగులో అక్రమ రవాణా

● మదనపల్లె డివిజన్‌లో రిటైల్ సేల్స్

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారా, కర్ణాటక మద్యం, నకిలీ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి కేసులు పెడుతున్నారు. వీటన్నింటిని మించి కొందరు వ్యక్తులు సైనికులు, మాజీ సైనికులు మిలటరీ క్యాంటీన్ నుంచి తెచ్చుకునే మద్యాన్ని కొనుగోలు చేసి రిటైల్‌గా విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఇంట్లో మూడు ఫుల్ బాటిళ్లకు మించి మద్యం నిల్వ ఉంచరాదు. కానీ రిటైల్ వ్యాపారులు నిబంధనలు అతిక్రమించి మిలటరీ మద్యాన్ని నిల్వ ఉంచుకుని మరీ విక్రయిస్తున్నారు.



మూడు స్కాచ్‌లు.. ఆరు బ్రాందీ బాటిళ్లుగా..

డిఫెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికులు, అధికారులు, కెప్టెన్‌లకు వారి హోదాను బట్టి మిలటరీ క్యాంటీన్‌లో కేంద్ర, రాష్ట్ర పన్నులు మినహాయించి సరుకులు, వస్తువులు, మద్యం విక్రయిస్తారు. ఆంధ్రలో మద్యం ధరల కన్నా మిలటరీ మద్యం ధరలు అతి తక్కువగా ఉండటంతో పాటు నికార్సైన సరుకు అనే ఊహతో మద్యంప్రియులు వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొంతమంది రిటైల్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలోని మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని ప్రధాన పట్టణాల్లో మిలటరీ మద్యం ముసుగులో అక్రమంగా మద్యం రవాణా అవుతోంది. ముఖ్యంగా బ్లాక్ అండ్ వైట్, 100 పైపర్స్, అమృత్, ఇంద్రి, బ్లాక్ డాగ్, బ్లాక్ లేబుల్ నుంచి రెడ్ లేబుల్ వంటి స్కాచ్‌లతో పాటు బ్లెండర్ ప్రైడ్ విస్కీ, మార్ఫియస్ బ్రాందీ బ్రాండ్లను మద్యం ప్రియులు ఇష్టపడుతున్నారు. రిటైల్ వ్యాపారులు కూడా వీటినే తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

బెంగళూరు, తిరుపతి నుంచి రవాణా


కర్ణాటక రాజధాని బెంగళూరు, తిరుపతి కేంద్రాల్లో మిలటరీ క్యాంటీన్లు ఉన్నాయి. తిరుపతి క్యాంటీన్ కన్నా బెంగళూరు క్యాంటీన్‌లో ధరలు తక్కువగా వుండటంతో ప్రతి నెలా మాజీ సైనికులు, సైనికులు, మిలటరీ ఉద్యోగులు అక్కడికే వెళ్లి వారి కోటా ప్రకారం మద్యం కొనుగోలు చేసి, వాటి బిల్లులతో ఆంధ్రలోకి తీసుకొస్తారు. కొందరు మద్యం సేవించని వారి నుంచి రిటైల్ వ్యాపారులు మిలటరీ మద్యాన్ని కొనుగోలు చేసి ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 లాభంతో విక్రయిస్తున్నారు. వాస్తవంగా బిల్లులు లేకుండా మిలటరీ మద్యాన్ని రవాణా చేయడం, నిల్వచేయడం చట్టవిరుద్ధం. ఈ విషయంపై ఎక్సైజ్ పోలీసులు దృష్టి పెట్టకపోవడంతో రీటైల్ వ్యాపారులు ఆడిందే ఆటగా సాగుతోంది. జిల్లాలో 1000మందికి పైగా మాజీ సైనికులు, సైనిక ఉద్యోగులు వుండగా, వారి కోటా ప్రకారం ఎంత లేదన్నా 6వేల బాటిళ్ల క్యాంటీన్ బిల్లులతో బెంగళూరు నుంచి జిల్లాలోకి వస్తున్నట్లు అంచనా.

క్యాంటీన్ వద్దే బేరసారాలు

జిల్లాలో కొందరు ప్రతి నెలా బెంగళూరులోని మిలటరీ క్యాంటీన్ వద్దకు వెళ్లి అక్కడ సైనికులు, మాజీ సైనికులు, అధికారులతో ముందస్తుగా భేరాలు కుదుర్చుకుంటున్నారు. అధికారుల పేరుతోనే బిల్లులు తీసుకుని మిలటరీ మద్యాన్ని కొనుగోలు చేసి, అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో ఆంధ్రకు తరలిస్తున్నారు.

ఆరు నెలల క్రితం మదనపల్లె ఎక్సైజ్ పోలీసులు ఇటువంటి వాహనాన్ని సీజ్ చేసి అంగళ్లకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అంతే కాకుండా గత నెల 22వ తేదీన మదనపల్లెకు చెందిన రమేశ్ అనే వ్యక్తి 41 మిలటరీ మద్యం బాటిళ్లను కర్ణాటక నుంచి మదనపల్లెకు రవాణా చేస్తుండగా పట్టణంలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద బిల్లులు చూస్తే బెంగళూరుకు చెందిన వ్యక్తుల పేరిట ఉన్నట్లు బయటపడ్డాయి. దీంతో ఎక్సైజ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. చాప కింద నీరులా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై జిల్లా ఎక్సైజ్ అధికారులు దృష్టి సారిస్తే మిలటరీ మద్యం ముసుగులో సాగుతున్న అక్రమ దందాను నివారించవచ్చు. ఏపీ బేవరేజస్ మద్యం విక్రయాలు పెంచవచ్చు.

మాజీ సైనికుల పేరు చెప్పి విక్రయించే వారిని అరెస్టు చేయాలి..



మదనపల్లె డివిజన్‌లో మాజీ సైనికుల పేర్లు చెప్పుకుని మిలటరీ మద్యం రవాణా, విక్రయాలు చేస్తున్న వారిని అరెస్టు చేయాలి. డివిజన్‌లో 300 మంది మాజీ సైనికులు వున్నారు. కొంత మంది మాజీ సైనికులంటూ మద్యం రవాణా చేస్తూ, అధికారులు పట్టుకుంటే తప్పించుకోవాలని చూస్తున్నారు. అటువంటి వారిని అరెస్టు చేయడానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తాం.

- కంచెర్ల శ్రీనివాసులునాయుడు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు, మదనపల్లె

రాష్ట్ర స్థాయి పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన చేతన్‌రెడ్డి, మానస, అనూష

తంబళ్లపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కన్నెమడుగు, తంబళ్లపల్లె హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కమిటీ కార్యదర్శులు నాగరాజు, ఝాన్సీ తెలిపారు. అక్టోబరు 30న వాల్మీకిపురం మండలం కొత్తమంచూరులో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో కన్నెమడుగు హైస్కూలు నుంచి ఎ.మానస, డి.చేతన్‌రెడ్డి, తంబళ్లపల్లె హైస్కూల్ నుంచి పి.అనూష ప్రతిభ చూపి రాష్ట స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడ కేబీసీ హైస్కూల్‌లో జరుగబోయే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎంలు మదన్‌మోహన్, శ్రీనివాసులు, పీడీ ఖాదర్‌బాష, పీఈటీ మొయినుద్దీన్, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అడ్డు తొలగించుకునేందుకే హత్య?

● కుటుంబసభ్యుల ప్రమేయంపై అనుమానాలు..

● కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు



బి.కొత్తకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో శుక్రవారం వెలుగుచూసిన యువకుడు జయప్రకాశ్‌రెడ్డి (24) హత్య వెనుక జరిగిన పరిణామాలు, అనుమానితుల విషయంలో దాదాపుగా స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలోని గోళ్లపల్లి పంచాయతీ గుడిసివారిపల్లి వాసి ఎంబీఏ విద్యార్థి జయప్రకాశ్‌రెడ్డి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై డీఎస్పీ ఆదేశాల మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. తల్లీ కొడుకుల మధ్య నెలకొన్న గొడవలే హత్యకు దారి తీసినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మూడు నెలలుగా తల్లికి దూరంగా ఉంటూ మద్యానికి అలవాటుపడిన జయప్రకాశ్‌రెడ్డిని గురువారం రాత్రి కొందరు నమ్మించి వెంట తీసుకెళ్లి మద్యం తాగించి హత్య చేసినట్లు భావిస్తున్నారు. నిందితులు గోళ్లపల్లి వద్ద హైవే వద్ద వైన్‌షాపులోకి ప్రవేశించి సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చంపిన చోటి నుంచి మృతదేహాన్ని గుడిసివారిపల్లి వద్దకు తీసుకెళ్లి పడేశారు. హత్య జరిగిన ప్రదేశంలో కీలక ఆధారాలను క్లూస్‌టీం సేకరించింది. గోళ్లపల్లిలోని జాతీయ రహదారిలో ఉన్న పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో యువకుడి హత్యపై పూర్తి వివరాలు బయటపటే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా మదనపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం రాత్రికి జయప్రకాశ్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామం గుడిసివారిపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పీలేరులో వేలూరు శ్రీ పీఠం అమ్మవారు



పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం వేలూరులోని శ్రీ పీఠం మహాలక్ష్మి అమ్మవారి బంగారు విగ్రహాన్ని దర్శించుకునే అవకాశం శనివారం పీలేరు వాసులకు దక్కింది. హైదరాబాదులో జరుగుతున్న కోటి దీపోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్న శ్రీ పీఠం నిర్వాహకులు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీఏ సత్య విజ్ఞప్తి మేరకు కాసేపు ఆగారు. పీలేరుకు చెందిన అర్చకులు సూత్రం కిరణ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. శ్రీ పీఠం నిర్వాహకులు అమ్మవారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సత్య దంపతులు, దినకర హోటల్ యజమాని ఆంజనేయులు దంపతులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసుల శక్తి పాఠం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భద్రతావలయం పోలీసులు అందిస్తున్న శక్తి పాఠం అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. జిల్లా యువత భవిష్యత్తుకు భద్రత కల్పించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు శక్తి టీం బృందాలతో కలిసి పాఠశాలలు, కళాశాలల్లో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైమ్ ఉచ్చులు, ఆన్‌లైన్ మోసాలు గురించి పోలీసులు వివరంగా తెలిపారు. తప్పుడు సమాచారం షేర్ చేయడం వలన ఎదురయ్యే చట్టపరమైన సమస్యలపై హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వాడకం వలన వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు నాశనం అవుతుందని వివరించారు. క్రికెట్ బెట్టింగ్ వంటి ఆర్థికి ఊరి పట్ల కూడా యువతను అప్రమత్తం చేశారు.

భక్త కనకదాస సేవలు ఆదర్శనీయం



భక్త కనకదాసకు నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

రాయచోటి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ స్థాపనకు కృషి చేసిన భక్త కనకదాస సేవలు అందరికీ ఆదర్శనీయం అని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సామాజిక సంస్కర్త, గొప్ప కవి భక్త కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీభక్త కనకదాస తన కీర్తనల ద్వారా సాజంలో పాతుకుపోయిన కుల వ్యవస్థలను, అసమానతలను నిర్భయంగా ప్రశ్నించారని, మానవత్వపు విలువలే అత్యున్నతమని చాటి చెప్పారన్నారు. పోలీసు సిబ్బంది తమ వృత్తి, విధులను నిర్వహించడంలో కనకదాస గొప్ప ఆదర్శాలను తప్పక ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్త కనకదాస సేవలను స్మరించుకున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్య



వెంకట్రమణ మృతదేహం

కలికిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేకపోతున్నాననే మనోవేదనతో చలంకోటి వెంకట్రమణ (56) ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై కలికిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తుమ్మలపేట వడ్డెపల్లె వాసి చలంకోటి వెంకట్రమణ ఇంటి ఖర్చుల కోసం దొరికిన చోటల్లా అప్పు చేశాడు. స్థానికంగా ఆదాయం లేకపోవడంతో కేరళ రాష్ట్రానికి వలసపోయి సంపాదన కోసం ప్రయత్నించాడు. అయితే అక్కడ కూడా వెంకట్రమణకు చుక్కెదురైంది. తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇక అప్పులు తీర్చలేనన్న మనోవేదనకు గురయ్యాడు. చివరికి విరక్తి చెంది శుక్రవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంకట్రమణను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శనివారం పరీక్షల అనంతరం వెంకట్రమణ శవాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

గ్రైండర్‌లో పడి మహిళ మృతి



అభినయ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్రైండర్‌లో పడి మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం మడికయ్యల శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న మహేశ్ భార్య అభినయ (20) బెంగళూరు రోడ్డు సమీపంలో మిరపకాయల బజ్జీల వ్యాపారం నిర్వహిస్తుండగా, మహేశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తమకు సొంతంగా ఉన్న గ్రైండర్‌లో పిండి వేస్తూ ప్రమాదవశాత్తు మెడకు వేసుకున్న ఓణీ గ్రైండర్‌లో పడడంతో యువతిని అందులోకి లాగేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఎంతసేపటికీ అభినయ రాకపోవడంతో మహేశ్ పెద్దమ్మ నాగరత్నం అభినయకు ఫోన్ చేసింది. ఫోన్ కూడా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి షాపు పక్కన ఉన్న వారికి ఫోన్ చేసి విషయం తెలిపింది.

అక్కడికి వెళ్లి చూడగా గ్రైండర్‌లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కబడ్డీ, ఖోఖో పోటీలకు హర్షియ ఎంపిక



హర్షియను అభినందిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తబోయనపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షి యా రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు శనివారం ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ డాక్టర్ ప్రణవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఇసుక టిప్పర్ బోల్తా : ఇద్దరికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గండి నుంచి ఇసుక తీసుకొని వెళ్తున్న టిప్పర్ శనివారం మద్దిరేవుల బ్రిడ్జి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ మేరకు టిప్పర్‌లో ఉన్న క్లీనర్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇసుక టిప్పక్ కొత్తగా రోడ్డు జరుగుతుండడంతో ఎత్తుగా ఉండటం వలన అదుపు తప్పి కింద పడిందని స్థానికులు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్, క్లీనర్‌ను ఓ ప్రైవుటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



సుగుణ మృతదేహం

మదనపల్లె అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో గాలేటి సుగుణ (34) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ నడిమూరుకు చెందిన సుధాకర్‌తో చెంబకూరుకు చెందిన కృష్ణప్ప, అమరావతి దంపతుల కుమార్తె సుగుణకు 2006లో వివాహం చేశారు. ఇటీవల మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె, రాజానగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని సుధాకర్ చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఏడో తరగతి చదువుతున్న నందికిషోర్, మూడేళ్ల తేజశ్విని ఉన్నారు. వీరు పిల్లలతో కలిసి నీరుగట్లువారిపల్లె నుంచి స్వగ్రామం మాలేపాడుకు గురువారం వెళ్లారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు కూడా తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. తరువాత ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం ఉదయం బావిలో శవమై కనిపించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే తాలుకా పోలీసులు బావి వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ ఆత్మహత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గుంజన నదిలో పడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరపురాజుపల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి వద్ద గుంజన నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న కోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో నీటిలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు.

పీలేరు రైతు బేజారు....

● రైతుబజార్ ప్రతిపాదనలకే పరిమితమా?!

● అదిగో ఇదిగో అంటూ అధికారుల హడావిడి

● నాలుగేళ్లుగా రూ.26 లక్షలతోనే అంచనా...

● పెరగని అంచనా వ్యయంతో అనుమానాలు

పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదిగో ప్రతిపాదనలు, అవిగో నిధుల మంజూరు, అదిగదిగో నిర్మాణం అంటూ గడిచిన నాలుగేళ్లుగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పీలేరులో రైతు బజారు నిర్మాణంపై ప్రజల చెవిలో పూలు పెడుతున్నారు. ఏడాదిలో మూడుసార్లు స్థలపరిశీలన జరపడం, రైతు బజారు నిర్మాణానికి అనుమతులు-నిధుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పడం, మూడు నెలల్లో వాటిని సాధించి ఆరు నెలల్లో రైతు బజారును నిర్మించేస్తాం అంటూ ప్రగల్భాలు పలకడం పరిపాటిగా మారింది. నాలుగేళ్లుగా ఆ పలుకులు పలుకుతున్నది కూడా ఒకే అధికారి కావడం విశేషం. ఒకే అధికారి నాలుగేళ్లుగా అవే మాటలు చెప్పడం చూసి పీలేరు ప్రజలు, రైతులు విసిగిపోయారు. అసలు పీలేరులో రైతు బజారు నిర్మించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉందా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

నాలుగేళ్లుగా ప్రతిపాదనల దశలోనే....

పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ప్రభుత్వంలో, ప్రజల్లో డిమాండు గత దశాబ్దన్నర కాలంగా ఉంది. దాని ఏర్పాటుకు అనువైన స్థలం లభ్యం కాకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషి కారణంగా 2022లో పీలేరులోని వారపు సంత ప్రాంగణం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో 47 సెంట్లను రైతు బజారు కోసం కేటాయించారు. 2022 అక్టోబరు 16వ తేదీ జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు స్థల పరిశీలన చేసి రూ.26 లక్షలతో 2023 సంక్రాంతి నాటికి రైతు బజారును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆ తరువాత పీలేరును సందర్శించిన పలువురు జిల్లా అధికారులు సైతం త్వరలోనే పీలేరుకు రైతు బజారు మంజూరవుతుందని, తద్వారా పీలేరు ప్రాంత రైతులకు గిట్టుబాటు ధరలు లభించడమే కాకుండా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. వారి మాటలు కేవలం నీటిమూటలుగా మిగిలిపోయాయి తప్ప రైతుబజారు నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ఈలోపు 2024లో కూటమి ప్రభుత్వం కొలువు దీరడం, పీలేరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పురం రామ్మూర్తి సైతం రైతు బజారు ప్రతిపాదనలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగాయి. ఆయన అభ్యర్థన మేరకు మరోమారు స్థల పరిశీలన జరిపిన మార్కెటింగ్ శాఖాధికారులు ప్రభుత్వానికి ఫీజుబులిటీ రిపోర్టు సైతం పంపారు. అయినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రైతు బజారు ఏర్పాటులో పురోగతి కనిపించలేదు. ఈ నేపథ్యంలో జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు గత నెలాఖరులో మరోమారు అదే స్థలాన్ని పరిశీలించి, అవే రూ.26 లక్షల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామని ప్రకటించడంతో స్థానికంగా అనుమానాలు రేకెత్తించాయి.

పెరగని అంచనా వ్యయంతో అనుమానాలు

రైతు బజారు నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం అధికారులు పంపిన అంచనాల్లోనూ నాలుగేళ్లుగా మార్పు లేకపోవడం కూడా అధికారుల చిత్తశుద్ధిపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నాలుగేళ్లుగా సిమెంటు, స్టీలు, ఇసుక, కంకర, కూలీలు పెరిగిపోయిన నేపథ్యంలో అంచనాలు పెంచకుండా, పాత అంచనాలతో సకల హంగులతో రైతు బజారు ఎలా నిర్మిస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే అంచనా విలువ పెంచే వారని, అలా చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘనత వహించిన మార్కెటింగ్ శాఖ అధికారులు పీలేరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

రాష్ట్ర కమిషనర్‌కు పంపాం...

పీలేరులో రైతు బజారు నిర్మాణం నాలుగేళ్లుగా ఆలస్యం అవుతున్న మాట వాస్తవం. అందుకు పలు కారణాలు ఉన్నప్పటికీ ఎలాగైనా కట్టి తీరాలన్న సంకల్పంతో ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- త్యాగరాజు, ఏడీ, మార్కెటింగ్ శాఖ

ఉభయతారకంగా రైతు బజారు

పీలేరు సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని అధికారులు రైతు బజారు కోసం ఎంపిక చేశారు. ప్రతి మంగళవారం వారపు సంత జరిగిన తరువాత పీలేరు పరిసర ప్రాంతాల్లోని రైతులు తమ కూరగాయాలను స్థానిక పాతబస్టాండులో రోడ్డుపై పెట్టుకుని విక్రయించుకుంటూ ఉంటారు. సరైన వసతులు లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు తమ వ్యాపారాలు సాగించుకుని ఇళ్లకు వెళ్లిపోతుంటారు. అటువంటి వారి కోసం రైతు బజారులో దుకాణాలు కేటాయిస్తే వారందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారాలు చేసుకోవచ్చని, ప్రజలకు కూడా తాజా ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె, రాయచోటి పట్టణాల్లోని రైతు బజార్లను విజయవంతంగా నడుపుతున్న జిల్లా ఉన్నతాధికారులు అదే సూత్రాన్ని పీలేరులో కూడా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రైతు బజారు కోసం ఎంపిక చేసిన స్థలం



2022లో రైతు బజారు కోసం పీలేరులో స్థలపరిశీలన చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

కళాశాల ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు



విద్యార్థినిపై దాడి

- చర్యలు తీసుకోవాలని బాధిత తండ్రి విజ్ఞప్తి
- క్రమశిక్షణా చర్యలు తప్పవు : కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్/క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో శనివారం చోటుచేసుకున్న ఘటన విద్యార్థి వర్గాల్లో కలకలం రేపింది. అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి అదే కళాశాల విద్యార్థినిపై భౌతికదాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ సంఘటనతో కళాశాల వాతావరణం ఉద్రిక్తంగా మారింది. చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకోవడంతో కోపోద్రిక్తుడై సహవిద్యార్థినిపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. అక్కడే ఉన్న తోటివిద్యార్థులు, అధ్యాపకులు వెంటనే అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం బాధిత విద్యార్థినిని వైద్య పరీక్షల కోసం కళాశాల మహిళా సిబ్బందితో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తన కుమార్తెపై దాడి చేసిన విద్యార్థిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన కళాశాల డైరెక్టర్ దాడికి పాల్పడిన విద్యార్థిపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల మధ్య వివాదాలు పెరుగుతున్న నేప థ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ, బీజేపీ నాయకులు తెలిపారు. కళాశాలల్లో సీసీ కెమెరాల పర్యవే క్షణ, కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలన్నారు.

దాడి చేసిన విద్యార్థిపై కేసు నమోదు

దాడి చేసిన యువకుడిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన అబ్బవరం పీరావల్లి బీకాం కంప్యూటరు ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, అదే కళాశాలలో ఒంటిమిట్టకు చెందిన యువతి కూడా చదువుతోందన్నారు. శనివారం తరగతి గదిలో కంప్యూటరుకు సంబంధించి పేపర్లు తీసుకుంటున్న సమయంలో పీరావల్లి మరో పేపరు ఇచ్చాడని, కానీ ఆ పేపరు తనది కాదని యువతి చెప్పడంతో తీవ్ర కోపంతో తరగతి గదిలోనే విద్యార్థినిని జుట్టు లాగి చేతులు కాళ్లతో కొడుతూ దూషించాడన్నారు. ఈ నేపధ్యంలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కళాశాల డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఏబీవీపీ, బీజేపీ ప్రతినిధులు

ఎలుగుబంటి దాడిలో గాయపడిన వృద్ధుడికి ఆర్థికసాయం

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వృద్ధుడు గోపాలయ్యకు కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్‌వో స్వామివివే కానంద ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల సాయం శనివారం అందించారు. చలమారెడ్డి కొట్టాలు సమీపంలో గోపాలయ్య ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేశారని అటవీ అధికారులు తెలిపారు. ఇటీవల గోపాలయ్యపై ఎలుగు బంటి దాడి చేసిందని, ఈ మేరకు మానవతా దృక్పథంతో అటవీ శాఖ సిబ్బంది ఈ ఆర్థిక సాయం అందించారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్
- రెండోరోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నారు. ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు శనివారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో రెండోరోజు కొనసాగాయి. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మాంచోఫెర్రర్‌లు పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాంచోఫెర్రర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ ప్రాంతంలో అనంతపురం వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరపడం శుభపరిణామమన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా ఆటల్లో గెలవాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. క్రీడా స్ఫూర్తి ఉన్నప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారన్నారు. క్రీడాపోటీలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్డీఓ మలోలా, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రాజేష్, రెండు జిల్లాల అధ్యక్షులు దివాకర్ రావు, మధునాయక్, ఆర్డీఓలు కేశవనాయుడు, విశ్వనాథ్‌చౌదరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

- వాలీబాల్ సెమీస్ పోటీల్లో విశాఖపట్నం జట్టుపై నంద్యాల గెలుపొందింది. మరో సెమీస్‌లో పార్వతీపురం జట్టుపై తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో నంద్యాల విజేతగా నిలిచింది.
- బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో విజయనగరంపై అన్నమయ్య, తిరుపతిపై తూర్పుగోదావరి జట్టు, సీసీఎల్ఏపై కాకినాడ జట్టు గెలుపొందాయి.
- పురుషుల సింగిల్స్‌లో కడపపై ప్రకాశం, తిరుపతిపై అంబేడ్కర్ కోనసీమ జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.
- మహిళల డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై విజయ నగరం, కడప జట్టుపై అనంతపురం గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.
- మహిళా సింగిల్స్‌లో బాపట్లపై ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జట్టుపై కాకినాడ, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జట్లు గెలుపొందాయి.
- టెన్నీకాయిట్‌లో విజయనగరంపై విశాఖపట్నం జట్టు గెలుపొందింది. అన్నమయ్యపై చిత్తూరు, అనంతపురంపై బాపట్ల, అనకాపల్లిపై కర్నూలు గెలుపొందాయి.
- టేబుల్‌టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో అల్లూరి సీతారామరాజుపై అనంతపురం ఫారెస్ట్‌సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై అనంతపురం గెలిచింది.

ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడమే

లక్ష్యంగా పనిచేయాలి

- స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు... థర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా
- అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమావేశమై ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయమై సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడే విధంగా ఆ చర్యలుండాలని స్పష్టం చేశా రు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు.

లోతుగా సమీక్షించిన డిప్యూటీ సీఎం

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయమై పట్టుదలతో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులతో లోతుగా సమీక్షించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, నంద్యాల, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న 17,053 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో 5,300 చదరపు కిలోమీటర్లలో ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయని అధికారులు వివరించారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని వివరించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి తిరుపతి, పీలేరు, గుంటూరు, ఆత్మకూరులలో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయని వివరించారు. తరచూ అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లు చేపట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని చెప్పారు.

20 ఏళ్లలో 14 వేల టన్నుల ఎర్రచందనం స్వాధీనం

తాము తీసుకుంటున్న చర్యల కారణంగా 2004 నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదయ్యాయని, 10,450 వాహనాలను సీజ్ చేశామని అన్నారు. మొత్తం 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్జర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆధిక్యతలో చిత్తూరు

- వెనుకంజలో అనంతపురం జట్టు



కడప స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శనివారం ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు కర్నూలు జట్టుపై 85 పరుగుల ఆధిక్యత సాధించింది. ఇదిలా వుండగా కడప-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం 144 పరుగుల వెనుకంజలో వుంది.

కేవోఆర్‌ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంతంలోని కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 28.3 ఓవర్లలో 63 పరుగులకు చేతులెత్తేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు 34.3 ఓవర్లలో కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. బౌలింగ్ విభాగంలో రక్షణ్‌సాయి (చిత్తూరు) 6వికెట్లు సాధించడం విశేషం. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు ఇప్పటివరకూ 85 పరుగుల ఆధిక్యత లభించింది.



6 వికెట్లు తీసిన రక్షణ్ సాయి (చిత్తూరు)

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప- అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప తన మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టి 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ప్రశాంత్ 41 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. దీంతో మరో 144 పరుగుల వెనుకంజలో అనంతపురం ఎదురీదుతోంది.

ఆదర్శమూర్తి భక్త కనకదాసు : డీఆర్వో

కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వరకర్త అయిన భక్త కనకదాసు సమాజాన్నే కాక భగవంతున్ని సైతం మెప్పించిన ఆదర్శమూర్తి అని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాలులో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భక్త కనకదాసు జయంత్యుత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా డీఆర్వోతో పాటు ఎస్డీసీ వెంకటపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భక్త కనకదాసు చిన్న వయసులోనే నరసింహ స్తోత్రం, రామ ధ్యానమంత్రం, మోహన తరంగిని అనే కవిత్వాలను రచించారన్నారు. సాధారణ కన్నడ భాషల్లో కనకదాసు ఎన్నో కీర్తనలు రచించి ఆలపించారు. కీర్తనలు రచిస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడిగా పేరు గడించారన్నారు. ఆయన సైన్యంలో కూడా పని చేసినట్లు కీర్తనల ద్వారా తెలుస్తోందన్నారు. అలాగే కర్ణాటక సంగీతం కోసం ఎనలేని సేవలు చేశారన్నారు. అంతకుముందు డీఆర్వో భక్త కనకదాసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, బీసీ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భక్త కనకదాసు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

పాముకాటుకు వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు చిలమల గురయ్య (43) మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలోని కాపువీధికి చెందిన గురయ్య ఈనెల 6వతేదీ రాత్రి 11గంటల సమయంలో తన ఇంటి ముందు కూర్చుని ఉండగా విష పురుగు అతని కుడికాలు బొటనవేలుకు కాటు వేసిందని, అయితే వారు దానిని తేలిగ్గా తీసుకుని నిద్రపోయారన్నారు. అయితే మరుసటిరోజు కాటు వేసిన చోట కమిలి ఉండడం, నల్లగా మారడం గమనించి వెంటనే అతని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి రక్తపరీక్షలు నిర్వహించి విషానికి విరుగుడు ఇచ్చారు. అయినా చికిత్స పొందుతున్న సమయంలో కోలుకోలేకపోవడంతో 7న మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రసవత్తరంగా బ్యాడ్మింటన్ క్వాలిఫై మ్యాచ్‌లు

- నేటి నుంచి మ్యాచ్‌లు ప్రారంభం

కడప స్పోర్ట్స్, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీ శనివారం నుండి 11వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ మినీ (అండర్-11) బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొలిరోజున క్వాలిఫై మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి బాల, బాలికలు హాజరయ్యారు. క్వాలిఫై మ్యాచ్‌లలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఈనెల 9వ తేదీ ఆదివారం నుండి జరగనున్న అసలైన సమరానికి సిద్ధం కావాల్సి వుంది. కాగా మెయిన్ డ్రాకు దాదాపు 250 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్ జిలానీ బాషా వెల్లడించారు.



క్వాలిఫై మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

పులివెందుల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణ సమీపంలోని గోవింద రాజ టెక్స్‌టైల్స్‌లో తమిళనాడు కు చెందిన శరవణ్ (35) అనే కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శుక్ర వారం అర్ధరాత్రి శరవణ్ టెక్స్ టైల్స్‌లోని ఓ గదిలో ఉరి వేసు కొని మృతి చెందినట్లు తెలిసింది. కానీ ఈ విషయం బయటకు రాకుండా గోవిందరాజ టెక్స్‌టైల్స్ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. శనివారం ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొ ని వివరాలు సేకరించినట్లు తెలిసింది. దీనిపై మృతుడి బంధువు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



మృతి చెందిన శరవణ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా గోవిందాపురం ఉన్నత పాఠశాలలో ఈనెల 8 నుండి 9వ తేదీ వరకు జరుగుతున్న 69వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటి ప్రతిభ కనబరచడం హర్షణీయమని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి చంద్రావతి తెలిపారు. ఇందులో అండర్-14 బాల, బాలికల హైజంప్ విభాగంలో ఎస్.కె.జాస్మిన్ ద్వితీయ స్థానం, 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో రాకేశ్ బంగారు పతకంతో పాటు 100 మీటర్ల విభాగంలో సైతం తృతీయ స్థానంలో నిలిచారన్నారు. కాగా 100 మీటర్లతో పాటుగా 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో వైష్ణవి తృతీయ విజేతగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూలు విద్యార్థిని



వల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూలులో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 ఖోఖో పోటీల్లో ఏపీమోడల్ స్కూలు, కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. మండలంలోని గంగాయపల్లె మోడల్ స్కూలు, కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీపీ మొదటి సంవత్సరం చదువుతున్న మోక్షిత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, పీడీ సుశీలమ్మ, కళాశాల సిబ్బంది అభినందించారు.

దీపోత్సవం వ్యాఖ్యాతగా చంద్రశేఖరరావుకు ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడపకు చెందిన ఆధ్యాత్మిక రచయిత, ప్రవచనకర్త డాక్టర్ ఎంఎల్ఎన్ చంద్రశేఖర్‌రావుకు శ్రీశైలంలో నిర్వహించనున్న దీపోత్సవ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించాలని శనివారం శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి ఆహ్వానం అందింది. ఈనెల 10వ తేదీన శ్రీశైలం ఆలయ పుష్కరిణి వద్ద జరిగే లక్ష దీపోత్సవం, దశవిధ హారతుల కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కోరారు. పెండ్లిమర్రి ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న చంద్రశేఖరరావు 40 ఆధ్యాత్మిక గ్రంథాలు, 12 పాఠ్యపుస్తకాలు రచించారు. తిరుమల, శ్రీశైలం వంటి పవిత్ర క్షేత్రాల్లో ప్రవచనాలు, వ్యాఖ్యానాలు చేసిన ఆయనకు ఈ ఆహ్వానం రావడం పట్ల కడప సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

అప్పులు చేయడంలో వైసీపీ, టీడీపీ దొందూదొందే

- రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి



కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అప్పులు చేయడంలో వైసీపీ, టీడీపీ దొందూదొందే అని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీస్తే అదేబాటలో ఇపుడు కూటమి సర్కారు అప్పులు చేస్తోందని విమర్శించారు. కూటమి సర్కారు 17 నెలల పాలనలో రూ.2.27 లక్షల కోట్లు అప్పులు తెచ్చిందని, ఇది బడ్జెట్‌కు రెండింతలన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో కూటమి సర్కారు ప్రజలపై భారం మోపిందన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనలో పిల్లికి భిక్షం వేసినట్లుగా రూ.1500 కోట్లు గ్రాంట్ రూపంలో ఇవ్వడం తీరని అన్యాయమన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ట్రబుల్ ఇంజన్ సర్కారుగా మిగిలిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సలావుద్దీన్, ప్రసాద్ గౌడ్, కుల్లాయప్ప, మైనుద్దీన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'భక్త కనకదాసు బాటలో నడుద్దాం'



భక్త కనకదాసుకు నివాళులు అర్పిస్తున్న కురబ సంఘం నేతలు

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భక్త కనకదాసు చూపిన బాటలో నడుద్దామని కురబ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకట్రమణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి నాగేంద్రరాజు తెలిపారు. శనివారం భక్తకనక దాసు జయంతి సందర్భంగా రాయచోటి కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు తది తరులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్త కనకదాస, తన రచనల ద్వారా సమాజ నిర్మాణానికి దోహదం చేశారన్నారు. ఆయన చూసిన బాటలో మనమందరం నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్‌రెడ్డి, బీసీ వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, కురబ సంఘ నాయకులు రఘునాథ్, జబ్బల శ్రీనివాస్, ఈశ్వరయ్య, అడ్వకేట్ రవిశంకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని కురుబ సంఘం కార్యాలయంలో కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్త కనకదాసు తాత్వికవేత్త అని కొనియాడారు. కురబ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు తరిగొండ ఈశ్వరయ్య మాట్లాడుతూ భక్త కనకదాస జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శప్రాయంగా తీసుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లయన్ నాగేశ్వరరావు, అడ్వకేట్ రవిశంకర్, క నాయకులు సుధాకర్, అంకిశెట్టిపల్లె జబ్బల రెడ్డెప్ప, దనపల్లె మడికయ్యల శివాలయం చైర్మన్ కొప్పల వెంకట్రమణ, మురళీకుమార్, నాగేంద్ర రమణయ్య, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవై గ్రామీణ్ దరఖాస్తు గడువు పొడిగింపు



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ కేఎన్ ప్రసాద్

రామపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) దరఖాస్తు గడువును నవంబర్ 5 నుంచి ఈ నెల 30 వరకు పొడిగించినట్లు హౌసింగ్ ఏఈ కేఎన్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని నల్లగుట్లపల్లి పంచాయతీ ఎస్టీ కాలనీలో శనివారం స్థానికులతో మాట్లాడారు. అర్హులైనవారు ఆయా గ్రామాల సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయంతో ఆవాస్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్‌కు సత్కారం

రాజంపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్యనాయుడును శనివారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో టీడీపీ నేతలు భారీ గజ మాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బనరసయ్యనాయుడు మాట్లాడుతూ రాజంపేట మార్కెట్‌యార్డును అన్నివిధాల అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముమ్మినేని విజయ కుమార్ చౌదరి, ఆర్ జనార్దన్‌నాయుడు, పిడికిసి సంతోష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్‌బాబుకు సత్కారం



ప్రసాద్‌బాబును సత్కరిస్తున్న రాజంపేట కూటమి నేతలు

రాజంపేట, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబును రాజంపేట కూటమి నాయకులు కౌన్సిలర్ రేనాటి రాఘవేంద్రవర్మ, సాయినగర్ శివమణి రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల రామకష్ణ తదితరులు శనివారం సాయంత్రం సత్కరించారు. రాజకీయ అంశాలపై చర్చించారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడికి ఆర్థికసాయం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన దప్పేపల్లె, మేడిమాకుల గుంతకు చెందిన కొర్లకుంట నాగరాజుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ నెల 10న భూటాన్‌లో జరగనున్న ఈ పోటీలకు వెళ్లేందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంలో మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్ రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. దీంతో ఆయన శనివారం రాత్రి భూటాన్‌కు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ యువనాయకుడు పక్కీరయ్య, చింతకుపట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన స్థల వివాదం

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థలం విషయమై గ్రామస్తులు కొనుగోలుదారుడి మధ్య ఏర్పడిన వివాదం ఎస్ఐ రవికుమార్ జోక్యంతో సద్దుమణిగింది. పోలీసుల కథనం మేరకు రాయచోటికి చెందిన అమర్నాథరెడ్డి నారాయణరెడ్డిపల్లె ఆలయ ప్రాంగణం వద్ద స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో కంచె వేసేందుకు రావడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. అమర్‌నాథరెడ్డి స్థలం కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు చూపతుండగా, గ్రామస్తులు మాత్రం 300 ఏళ్లుగా ఇక్కడ గుడి ఉందని చెబుతున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాల ఏకరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరనాయుడు, బీజేపీ యువ మోర్చా నాయకుడు రేపన శివప్రసాద్, గొద్దిండ్ల రమణయ్య, వసంత శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గతంలో సుగవాసి పాలకొండ్రాయుడు పోరాడి అమ్మవారికి భూములను ఇప్పించారని తెలియ జేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని వివరించారు.

6 నుంచి 'సీపీఐ (ఎంఎల్) లిబరేషన్' మహాసభలు

రాయచోటి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, మతతత్వ, మనువాద శక్తులను ప్రకటిద్దాం అని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన పాత రాయచోటిలో డిసెంబర్ 6, 7 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వర్ధిల్లే ప్రజల ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అన్నారు. మన రాష్ట్రంలో అభివృద్ధి, సంపద సృష్టి సంక్షేమం తెస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన డబుల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన బాబు ప్రభుత్వ సంపదను కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ముందున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. అన్ని రంగాల కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐలను వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చెన్నయ్య, రఘునాధనాయుడు, మహిళా సంఘం నాయకురాలు సుజాత, రమణ, జయసింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్బారావుకు భీష్మ ఎక్సలెన్స్ అవార్డు



సుబ్బారావును అభినందిస్తున్న విశ్వవిద్యాలయ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన వారికి భారత ప్రభుత్వ విద్యాశాఖ అందించే భీష్మ ఎక్సలెన్స్ అవార్డు అన్నమాచార్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం డీన్, హెచ్‌వోడీ ఎం. సుబ్బారావు అందుకున్నారు. విద్యా రంగంలో అంకితభావం, వివిధ పరిశోధనల్లో చేసిన విశేష కృషి, విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం తదితర అంశాల్లో విశేష సేవలు అందించిందుకు 2025 సంవత్సరానికి ఈ పురస్కారం లభించింది. హైదరాబాదులో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఏఐసీటీఈ సమన్వయ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ శివరామకృష్ణ ప్రసాద్, బ్రెయిన్ ఓ విజన్ సొల్యూషన్స్ సీఈవో గణేశ్ ఈ అవార్డును అందజేశారు. సుబ్బారావును అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్ చాన్సలర్ ఈ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ హైదరాబాదులో జరిగిన ఈ వేడుకల్లో 20 రాష్ట్రాల నుంచి 250 మంది విద్యావేత్తలు, పాల్గొన్నారన్నారు

సోలార్ ప్లాంట్ పనుల అడ్డగింత



సోలార్ ప్లాంట్ పనులను అడ్డుకుంటున్న రైతులు

గాలివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూము కుంట సోలార్ ప్లాంట్ పనులను శనివారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కందుకూరి వెంకట్రమణ, గంగయ్య, ఈశ్వరయ్య మాట్లాడుతూ సర్వే నెంబరు 844/1లో తమ అనుభవంలో ఉన్న 4.48 ఎకరాల డీకేటీ భూమిని ప్రభుత్వం 2015లో స్వాధీనం చేసుకుని నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ, ఇప్పటి వరకు నష్టపరిహారం అందకపోగా, అధికారులు మాత్రం పదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ స్తంభాల నిర్మాణ పనులను అడ్డుకున్నామని తెలిపారు. వెంటనే నష్టపరిహారం చెల్లించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు



జేసీబీతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ప్రసాద్‌రెడ్డి

ఓబులవారిపల్లె, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొంతవారిపల్లెలో శనివారం గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, వీధి దీపాలు, విద్యుత్ లైన్లను మరమ్మతులు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

పెనగలూరు, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : గ్రామ కమిటీల ద్వారా వైసీపీని బలోపేతం చేస్తామని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీ నిర్మాణాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నందుకు వ్యతిరేకంగా శనివారం సాయంత్రం కొండూరు లో పెనగలూరు వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి అధ్యక్షతన రచ్చబండ సమావేశంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

5, 6 తేదీల్లో పాలిటెక్నిక్ అధ్యాపకులకు వర్క్‌షాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీలో డిసెంబరు 5, 6 తేదీల్లో పాలిటెక్నిక్ అధ్యాపకులకు వర్క్‌షాప్‌ను నిర్వహించ నున్నట్లు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తిరుపతి రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీ సిబ్బంది ఆధ్వర్యంలో తిరుపతిలో పాలిటెక్నిక్ అధ్యాపకుల వర్క్‌షాప్ నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల కు అక్రిడిటేషన్ ఎంతో ముఖ్యమన్నారు. దీని ద్వారా నాణ్యమైన విద్య, పరిశ్ర మలకు తగ్గట్టుగా విద్యార్థు లకు నైపుణ్యాలను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్మల్‌కుమార్ ప్రియ, శ్రీనివాసులు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెనగలూరు, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కొత్తపల్లె, ఇండ్లూరు గ్రామాల్లోని కార్యసిద్ధి వినాయక స్వామి, సిద్ధి వినాయకస్వామి దేవాలయాల్లో శనివారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. పి. కొత్తపల్లెలో వీరఎల్లె శివారెడ్డి, సుమలత దంపతుల ఆధ్వర్యంలో అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పెనగలూరు, అరుంధతివాడ, కళాకారులు కోలాటం ప్రదర్శించా. ఇండ్లూరులో సిద్ధి వినాయకునికి పూజల అనంతరం గ్రామోత్సవం చేశారు. కోలాటం ప్రదర్శించారు.

కోదండరాముడి సన్నిధిలో క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్



క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

ఒంటిమిట్ట, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి) : రెండో అయోధ్యగా పేరు గాంచిన ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ విఘ్నేశ్ సూర్య నారాయణ రాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పవన్ ఆయనకు స్వాగతం పలికి, ఆలయ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని శిల్ప సంపదను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, మండల టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, టీడీపీ నాయకులు దిలీప్ కుమార్, నాగార్జున, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జనసేనపార్టీ పీఏసీ సభ్యుడు కనకరాజు సూరిని (విఘ్నేశ్ సూర్యనారాయణరాజు) క్షత్రియ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆదివారం రాజంపేట మండలం పులపత్తూరులో క్షత్రియ కార్తీక వనమహోత్సవాలకు హాజరు కావడానికి శనివారం రాజంపేటకు వచ్చిన ఆయనను క్షత్రియ సంఘ నాయకులు పూలమాలలు వేసి శాలువా లు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలసిన ఎమ్మెల్యే శ్రీధర్



డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ తిరుపతిలోని ఎర్ర చదనం డిపోలో ఉన్న దుంగలు, ఎర్ర చంద నం పరిరక్షణ, కుంకీ ఏనుగులు, మానవ సంబంధాలు తదితర విషయాలపై తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటనలో భాగంగా వచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేషాచలం, వెలుగొండ, పాలకొండల్లో విస్తారంగా ఉన్న ఎర్రచందనం ఉందన్నారు. వాటిని పరిరక్షించే దిశగా కూటమి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లను ఎలా కట్టడి చేయాలనే అంశాన్ని కూడా అధికారులతో చర్చించారన్నారు.

కోదండరాముడి సన్నిధిలో ఎమ్మెల్సీ సీఆర్సీ



కోదండ రామాలయంలో ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య

ఒంటిమిట్ట, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయాన్ని రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ రామ చంద్రయ్య శనివారం కుటుంబ సభ్యులతో కలిసి సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య, మండల టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సీనియర్ నాయకుడు మామిళ్ల ఈశ్వరయ్య, మునిశంకర్ పాల్గొన్నారు.

రక్తదానం పుణ్యకార్యం: డీసీఎంఎస్ చైర్మన్



రక్తం సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రైల్వేకోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రక్తదానం పుణ్యకార్యం అని డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయ ప్రకాష్ తెలిపారు. శనివారం పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో తిరుపతికి చెందిన రక్షణ్ బ్లడ్ బ్యాంక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, కడప తదితర ప్రాంతాల్లోనే కాకుండా నియోజక వర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరించే ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు రక్తదానంపై ప్రజలకు అవ గాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి, రక్షణ బ్లడ్ బ్యాంకు జనరల్ సెక్రెటరీ జీవన్, సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, డైరెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పఠాన్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నందలూరు, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయ ఆవరణలో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసు ఎస్ఐ మన్నెం రామమోహన్, జీవీ సుబ్బరాజు సహకారంతో అనాథ యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మోహన్ మాట్లాడుతూ అనాథలకు, వృద్ధులకు శీతాకాలం సందర్భంగా చలికి ఇబ్బంది పడుతారనే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, గురుప్రసాద్, గంధం గంగాధర్, గండికోట కృష్ణ, తీగలకుంట వెంకటేష్, గుండు సురేష్, కొర్లకుంట సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అయ్యప్ప భక్తులకు శనివారం రైల్వేకోడూరు వేణుగోపాల్ స్వామి ఆలయ ప్రాంగణంలో రెడ్డివారి పల్లెకు చెందిన అయ్యప్ప భక్తుడు జడల సతీష్ అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని రావిరాల నుంచి గత నెల 22న పాదయాత్రగా బయలుదేరిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ ఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయ ప్రకాశ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, కూటమి నాయకుడు రవినాయుడు, తెలంగాణ అయ్యప్ప భక్తులు రమేశ్, వేణుగోపాల్, విష్ణు, లింగం, నందు, శేఖర్, వెంకటేష్, నాగేశ్వర్, గోవర్ధన్, నవీన్ పాల్గొన్నారు.

తిరువెంగళనాథ స్వామికి పూజలు



తిరువెంగళనాథ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రామాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మండలంలోని గువ్వలచెరువు పంచాయతీ పరిధిలోని తిరువెంగళనాథ స్వామి దేవాలయంలో శనివారం ఆలయ చైర్మన్ చీకటి దురా ప్రసాద్, కడప సీనియర్ ఆడిటర్ వెంకట్రమణ, హరి ప్రసాద్, ఆదినేని నాగార్జున ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గతంలో ఈ ఆలయం ఉన్నట్లు కూడా తెలియదని, ఇటీవల కడప కు చెందిన ఫారెస్ట్ ఆఫీసర్ అటవీ ప్రాంతాన్ని పరిశీలించడానికి గువ్వల చెరువు గ్రామస్థులు ఇక్కడ ఆలయం ఉన్నట్లు తెలిపారన్నారు. కాగా, గువ్వలచెరువు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లి స్వామి వారికి పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహించారు.

కిటకిటలాడిన సౌమ్యనాథస్వామి ఆలయం



బారులుతీరిన భక్తులు

నందలూరు, నవంబరు 8 : (ఆంధ్రజ్యోతి): నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. పలువురు భక్తులు తమ కోర్కెలు నెరవేరడంతో 108 ప్రదక్షిణలు చేశారు. వచ్చిన భక్తులకు సౌమ్యనాథ అన్నదాన ట్రస్టులో అన్నదానం చేశారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

రామాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమా దంలో మృతి చెందిన కసిరెడ్డిగారి పల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త వెంకట సుబ్బయ్య కుటుంబా నికి రూ. 5 లక్షల ప్రమాద బీ మా చెక్కును టీడీపీ మైనార్టీ నాయకుడు అజాంబాషా శనివారం అందజేశారు. తన కుటుంబానికి ఆర్థిక భరోసా అందించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌బాబు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డికి మృతుడి భార్య అనసూయా, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం, మంత్రిని విమర్శించే అర్హత శ్రీకాంత్‌రెడ్డికి లేదు

● మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రాద్‌రెడ్డిని విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మైనార్టీల ఓట్లతో నాలుగు సార్లు గెలిచిన ఆయన మైనార్టీలకు ఇసుమంత సాయం కూడా చేయలేదని విమర్శించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సవాల్ విసరడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే ప్రజావేదిక వద్దకు వస్తే మీరు చెప్పిన మాటకు ప్రజలే సమాధానం చెప్తారన్నారు. రాయచోటిలో 300 కోట్ల రూపాయల విలువైన డ్రైనేజీ పనులను చేపట్టిన శ్రీకాంత్‌రెడ్డి బినామీలు, నివాసాలు లేని చోట కాలువలు నిర్మించారని, దాని పూర్తి వివరాలు తెలియజేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ఈద్గా, ఖబర్‌స్థాన్‌కు స్థలం కేటాయించి దానికి ప్రహరీ గోడ, రాయచోటి పట్టణ నడిబొడ్డున షాదీఖానా నిర్మించింది టీడీపీ హయాంలోనే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రోఫా, సాంబశివారెడ్డి, నాగార్జునరెడ్డి, బసిరెడ్డి, కొండారెడ్డి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ మద్యం ముసుగులో అక్రమ రవాణా

● మదనపల్లె డివిజన్‌లో రిటైల్ సేల్స్

మదనపల్లె టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారా, కర్ణాటక మద్యం, నకిలీ మద్యం తయారీ, రవాణా, విక్రయాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి కేసులు పెడుతున్నారు. వీటన్నింటిని మించి కొందరు వ్యక్తులు సైనికులు, మాజీ సైనికులు మిలటరీ క్యాంటీన్ నుంచి తెచ్చుకునే మద్యాన్ని కొనుగోలు చేసి రిటైల్‌గా విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఇంట్లో మూడు ఫుల్ బాటిళ్లకు మించి మద్యం నిల్వ ఉంచరాదు. కానీ రిటైల్ వ్యాపారులు నిబంధనలు అతిక్రమించి మిలటరీ మద్యాన్ని నిల్వ ఉంచుకుని మరీ విక్రయిస్తున్నారు.



మూడు స్కాచ్‌లు.. ఆరు బ్రాందీ బాటిళ్లుగా..

డిఫెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికులు, అధికారులు, కెప్టెన్‌లకు వారి హోదాను బట్టి మిలటరీ క్యాంటీన్‌లో కేంద్ర, రాష్ట్ర పన్నులు మినహాయించి సరుకులు, వస్తువులు, మద్యం విక్రయిస్తారు. ఆంధ్రలో మద్యం ధరల కన్నా మిలటరీ మద్యం ధరలు అతి తక్కువగా ఉండటంతో పాటు నికార్సైన సరుకు అనే ఊహతో మద్యంప్రియులు వీటిని కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొంతమంది రిటైల్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలోని మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని ప్రధాన పట్టణాల్లో మిలటరీ మద్యం ముసుగులో అక్రమంగా మద్యం రవాణా అవుతోంది. ముఖ్యంగా బ్లాక్ అండ్ వైట్, 100 పైపర్స్, అమృత్, ఇంద్రి, బ్లాక్ డాగ్, బ్లాక్ లేబుల్ నుంచి రెడ్ లేబుల్ వంటి స్కాచ్‌లతో పాటు బ్లెండర్ ప్రైడ్ విస్కీ, మార్ఫియస్ బ్రాందీ బ్రాండ్లను మద్యం ప్రియులు ఇష్టపడుతున్నారు. రిటైల్ వ్యాపారులు కూడా వీటినే తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

బెంగళూరు, తిరుపతి నుంచి రవాణా

కర్ణాటక రాజధాని బెంగళూరు, తిరుపతి కేంద్రాల్లో మిలటరీ క్యాంటీన్లు ఉన్నాయి. తిరుపతి క్యాంటీన్ కన్నా బెంగళూరు క్యాంటీన్‌లో ధరలు తక్కువగా వుండటంతో ప్రతి నెలా మాజీ సైనికులు, సైనికులు, మిలటరీ ఉద్యోగులు అక్కడికే వెళ్లి వారి కోటా ప్రకారం మద్యం కొనుగోలు చేసి, వాటి బిల్లులతో ఆంధ్రలోకి తీసుకొస్తారు. కొందరు మద్యం సేవించని వారి నుంచి రిటైల్ వ్యాపారులు మిలటరీ మద్యాన్ని కొనుగోలు చేసి ఒక్కో బాటిల్‌పై రూ.300 నుంచి రూ.500 లాభంతో విక్రయిస్తున్నారు. వాస్తవంగా బిల్లులు లేకుండా మిలటరీ మద్యాన్ని రవాణా చేయడం, నిల్వచేయడం చట్టవిరుద్ధం. ఈ విషయంపై ఎక్సైజ్ పోలీసులు దృష్టి పెట్టకపోవడంతో రీటైల్ వ్యాపారులు ఆడిందే ఆటగా సాగుతోంది. జిల్లాలో 1000మందికి పైగా మాజీ సైనికులు, సైనిక ఉద్యోగులు వుండగా, వారి కోటా ప్రకారం ఎంత లేదన్నా 6వేల బాటిళ్ల క్యాంటీన్ బిల్లులతో బెంగళూరు నుంచి జిల్లాలోకి వస్తున్నట్లు అంచనా.

క్యాంటీన్ వద్దే బేరసారాలు

జిల్లాలో కొందరు ప్రతి నెలా బెంగళూరులోని మిలటరీ క్యాంటీన్ వద్దకు వెళ్లి అక్కడ సైనికులు, మాజీ సైనికులు, అధికారులతో ముందస్తుగా బేరాలు కుదుర్చుకుంటున్నారు. అధికారుల పేరుతోనే బిల్లులు తీసుకుని మిలటరీ మద్యాన్ని కొనుగోలు చేసి, అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో ఆంధ్రకు తరలిస్తున్నారు.

ఆరు నెలల క్రితం మదనపల్లె ఎక్సైజ్ పోలీసులు ఇటువంటి వాహనాన్ని సీజ్ చేసి అంగళ్లకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అంతే కాకుండా గత నెల 22వ తేదీన మదనపల్లెకు చెందిన రమేశ్ అనే వ్యక్తి 41 మిలటరీ మద్యం బాటిళ్లను కర్ణాటక నుంచి మదనపల్లెకు రవాణా చేస్తుండగా పట్టణంలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద బిల్లులు చూస్తే బెంగళూరుకు చెందిన వ్యక్తుల పేరిట ఉన్నట్లు బయటపడ్డాయి. దీంతో ఎక్సైజ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. చాప కింద నీరులా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారంపై జిల్లా ఎక్సైజ్ అధికారులు దృష్టి సారిస్తే మిలటరీ మద్యం ముసుగులో సాగుతున్న అక్రమ దందాను నివారించవచ్చు. ఏపీ బేవరేజస్ మద్యం విక్రయాలు పెంచవచ్చు.

మాజీ సైనికుల పేరు చెప్పి విక్రయించే వారిని అరెస్టు చేయాలి..



మదనపల్లె డివిజన్‌లో మాజీ సైనికుల పేర్లు చెప్పుకుని మిలటరీ మద్యం రవాణా, విక్రయాలు చేస్తున్న వారిని అరెస్టు చేయాలి. డివిజన్‌లో 300 మంది మాజీ సైనికులు వున్నారు. కొంత మంది మాజీ సైనికులంటూ మద్యం రవాణా చేస్తూ, అధికారులు పట్టుకుంటే తప్పించుకోవాలని చూస్తున్నారు. అటువంటి వారిని అరెస్టు చేయడానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తాం.

- కంచెర్ల శ్రీనివాసులునాయుడు,
మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు, మదనపల్లె

రాష్ట్ర స్థాయి పోటీలకు తంబళ్లపల్లె విద్యార్థులు

తంబళ్లపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కన్నెమడుగు, తంబళ్లపల్లె హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కమిటీ కార్యదర్శులు నాగరాజు, ఝాన్సీ తెలిపారు. అక్టోబరు 30న వాల్మీకిపురం మండలం కొత్తమంచూరులో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో కన్నెమడుగు హైస్కూలు నుంచి ఎ.మానస, డి.చేతన్‌రెడ్డి, తంబళ్లపల్లె హైస్కూల్ నుంచి వి.అనూష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడ కేబీసీ హైస్కూల్‌లో జరుగబోయే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎంలు మదన్‌మోహన్, శ్రీనివాసులు, పీడీ ఖాదర్‌బాష, పీఈటీ మొయినుద్దీన్, ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన చేతన్‌రెడ్డి, మానస, అనూష

అడ్డు తొలగించుకునేందుకే హత్య?

● కుటుంబసభ్యుల ప్రమేయంపై అనుమానాలు..

● కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు



బి.కొత్తకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో శుక్రవారం వెలుగుచూసిన యువకుడు జయప్రకాశ్‌రెడ్డి (24) హత్య వెనుక జరిగిన పరిణామాలు, అనుమానితుల విషయంలో దాదాపుగా స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలోని గోళ్లపల్లి పంచాయతీ గుడిసివారిపల్లి వాసి ఎంబీఏ విద్యార్థి జయప్రకాశ్‌రెడ్డి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై డీఎస్పీ ఆదేశాల మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. తల్లీ కొడుకుల మధ్య నెలకొన్న గొడవలే హత్యకు దారి తీసినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. మూడు నెలలుగా తల్లికి దూరంగా ఉంటూ మద్యానికి అలవాటుపడిన జయప్రకాశ్‌రెడ్డిని గురువారం రాత్రి కొందరు నమ్మించి వెంట తీసుకెళ్లి మద్యం తాగించి హత్య చేసినట్లు భావిస్తున్నారు. నిందితులు గోళ్లపల్లి వద్ద హైవే వద్ద వైన్‌షాపులోకి ప్రవేశించి సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చంపిన చోటి నుంచి మృతదేహాన్ని గుడిసివారిపల్లి వద్దకు తీసుకెళ్లి పడేశారు. హత్య జరిగిన ప్రదేశంలో కీలక ఆధారాలను క్లూస్‌టీం సేకరించింది. గోళ్లపల్లిలోని జాతీయ రహదారిలో ఉన్న పలు సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో యువకుడి హత్యపై పూర్తి వివరాలు బయటపడే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా మదనపల్లి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం రాత్రికి జయప్రకాశ్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామం గుడిసివారిపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పీలేరులో వేలూరు శ్రీ పీఠం అమ్మవారు



పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం వేలూరులోని శ్రీ పీఠం మహాలక్ష్మి అమ్మవారి బంగారు విగ్రహాన్ని దర్శించుకునే అవకాశం శనివారం పీలేరు వాసులకు దక్కింది. హైదరాబాదులో జరుగుతున్న కోటి దీపోత్సవంలో పాల్గొనేందుకు వెళుతున్న శ్రీ పీఠం నిర్వాహకులు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీఏ సత్య విజ్ఞప్తి మేరకు కాసేపు ఆగారు. పీలేరుకు చెందిన అర్చకులు సూత్రం కిరణ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. శ్రీ పీఠం నిర్వాహకులు అమ్మవారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సత్య దంపతులు, దినకర హోటల్ యజమాని ఆంజనేయులు దంపతులు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసుల శక్తి పాఠం

రాయచోటిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు భద్రతావలయం పోలీసులు అందిస్తున్న శక్తి పాఠం అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. జిల్లా యువత భవిష్యత్తుకు భద్రత కల్పించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు శక్తి టీం బృందాలతో కలిసి పాఠశాలలు, కళాశాలల్లో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ క్రైమ్ ఉచ్చులు, ఆన్‌లైన్ మోసాలు గురించి పోలీసులు వివరంగా తెలిపారు. తప్పుడు సమాచారం షేర్ చేయడం వలన ఎదురయ్యే చట్టపరమైన సమస్యలపై హెచ్చరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వాడకం వలన వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తు నాశనం అవుతుందని వివరించారు. క్రికెట్ బెట్టింగ్ వంటి ఆర్థిక ఊబి పట్ల కూడా యువతను అప్రమత్తం చేశారు.

భక్త కనకదాస సేవలు ఆదర్శనీయం

రాయచోటి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు కృషి చేసిన భక్త కనకదాస సేవలు అందరికీ ఆదర్శనీయం అని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సామాజిక సంస్కర్త, గొప్ప కవి భక్త కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీభక్త కనకదాస తన కీర్తనల ద్వారా సాజంలో పాతుకుపోయిన కుల వ్యవస్థలను, అసమానతలను నిర్భయంగా ప్రశ్నించారని, మానవత్వపు విలువలే అత్యున్నతమని చాటి చెప్పారన్నారు. పోలీసు సిబ్బంది తమ వృత్తి, విధులను నిర్వహించడంలో కనకదాస గొప్ప ఆదర్శాలను తప్పక ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ (అడ్మిన్) వీజే రామకృష్ణ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని భక్త కనకదాస సేవలను స్మరించుకున్నారు.



భక్త కనకదాసకు నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ

అప్పులు తీర్చలేక ఆత్మహత్య

కలికిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేకపోతున్నాననే మనోవేదనతో చలంకోటి వెంకట్రమణ (56) ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనపై కలికిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తుమ్మలపేట వడ్డెపల్లె వాసి చలంకోటి వెంకట్రమణ ఇంటి ఖర్చుల కోసం దొరికిన చోటల్లా అప్పు చేశాడు. స్థానికంగా ఆదాయం లేకపోవడంతో కేరళ రాష్ట్రానికి వలసపోయి సంపాదన కోసం ప్రయత్నించాడు. అయితే అక్కడ కూడా వెంకట్రమణకు చుక్కెదురైంది. తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇక అప్పులు తీర్చలేనన్న మనోవేదనకు గురయ్యాడు. చివరికి విరక్తి చెంది శుక్రవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంకట్రమణను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శనివారం పరీక్షల అనంతరం వెంకట్రమణ శవాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



వెంకట్రమణ మృతదేహం

గ్రైండర్‌లో పడి మహిళ మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గ్రైండర్‌లో పడి మహిళ మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం మడికయ్యల శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న మహేశ్ భార్య అభినయ (20) బెంగళూరు రోడ్డు సమీపంలో మిరపకాయల బజ్జీల వ్యాపారం నిర్వహిస్తుండగా, మహేశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం తమకు సొంతంగా ఉన్న గ్రైండర్‌లో పిండి వేస్తూ ప్రమాదవశాత్తు మెడకు వేసుకున్న ఓణీ గ్రైండర్‌లో పడడంతో యువతిని అందులోకి లాగేసింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.



అభినయ మృతదేహం

ఎంతసేపటికీ అభినయ రాకపోవడంతో మహేశ్ పెద్దమ్మ నాగరత్నం అభినయకు ఫోన్ చేసింది. ఫోన్ కూడా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి షాపు పక్కన ఉన్న వారికి ఫోన్ చేసి విషయం తెలిపింది.

అక్కడికి వెళ్లి చూడగా గ్రైండర్‌లో మృతి చెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కబడ్డీ, ఖోఖో పోటీలకు హర్షియ ఎంపిక

రాజంపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తబోయనపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షియా రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు శనివారం ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. ఈ సందర్భంగా పీడీ డాక్టర్ ప్రణవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



హర్షియను అభినందిస్తున్న దృశ్యం

ఇసుక టిప్పర్ బోల్తా : ఇద్దరికి గాయాలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గండి నుంచి ఇసుక తీసుకొని వెళ్తున్న టిప్పర్ శనివారం మద్దిరేవుల బ్రిడ్జి వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ మేరకు టిప్పర్‌లో ఉన్న క్లీనర్, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇసుక టిప్పక్ కొత్తగా రోడ్డు జరుగుతుండడంతో ఎత్తుగా ఉండటం వలన అదుపు తప్పి కింద పడిందని స్థానికులు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్, క్లీనర్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య


మదనపల్లె అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో గాలేటి సుగుణ (34) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీ నడిమూరుకు చెందిన సుధాకర్‌తో చెంబకూరుకు చెందిన కృష్ణప్ప, అమరావతి దంపతుల కుమార్తె సుగుణకు 2006లో వివాహం చేశారు. ఇటీవల మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె, రాజానగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని సుధాకర్ చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఏడో తరగతి చదువుతున్న నందికిషోర్, మూడేళ్ల తేజశ్విని ఉన్నారు. వీరు పిల్లలతో కలిసి నీరుగట్టువారిపల్లె నుంచి స్వగ్రామం మాలేపాడుకు గురువారం వెళ్లారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు కూడా తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. తరువాత ఏమి జరిగిందో తెలియదు కానీ శనివారం ఉదయం బావిలో శవమై కనిపించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే తాలుకా పోలీసులు బావి వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణ ఆత్మహత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



సుగుణ మృతదేహం

గుంజన నదిలో పడి వ్యక్తి మృతి

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరపురాజుపల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి వద్ద గుంజన నదిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న కోడూరు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో నీటిలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పీలేరు రైతు బేజారు....

● రైతుబజార్ ప్రతిపాదనలకే పరిమితమా?!

● అదిగో ఇదిగో అంటూ అధికారుల హడావిడి

● నాలుగేళ్లుగా రూ.26 లక్షలతోనే అంచనా...

● పెరగని అంచనా వ్యయంతో అనుమానాలు

పీలేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇదిగో ప్రతిపాదనలు, అవిగో నిధుల మంజూరు, అదిగదిగో నిర్మాణం అంటూ గడిచిన నాలుగేళ్లుగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు పీలేరులో రైతు బజారు నిర్మాణంపై ప్రజల చెవిలో పూలు పెడుతున్నారు. ఏడాదిలో మూడుసార్లు స్థలపరిశీలన జరపడం, రైతు బజారు నిర్మాణానికి అనుమతులు-నిధుల కోసం రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపామని చెప్పడం, మూడు నెలల్లో వాటిని సాధించి ఆరు నెలల్లో రైతు బజారును నిర్మించేస్తాం అంటూ ప్రగల్భాలు పలకడం పరిపాటిగా మారింది. నాలుగేళ్లుగా ఆ పలుకులు పలుకుతున్నది కూడా ఒకే అధికారి కావడం విశేషం. ఒకే అధికారి నాలుగేళ్లుగా అవే మాటలు చెప్పడం చూసి పీలేరు ప్రజలు, రైతులు విసిగిపోయారు. అసలు పీలేరులో రైతు బజారు నిర్మించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉందా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

నాలుగేళ్లుగా ప్రతిపాదనల దశలోనే....

పీలేరులో రైతు బజారు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ప్రభుత్వంలో, ప్రజల్లో డిమాండు గత దశాబ్దన్నర కాలంగా ఉంది. దాని ఏర్పాటుకు అనువైన స్థలం లభ్యం కాకపోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషి కారణంగా 2022లో పీలేరులోని వారపు సంత ప్రాంగణం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో 47 సెంట్లను రైతు బజారు కోసం కేటాయించారు. 2022 అక్టోబరు 16వ తేదీ జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు స్థల పరిశీలన చేసి రూ.26 లక్షలతో 2023 సంక్రాంతి నాటికి రైతు బజారును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆ తరువాత పీలేరును సందర్శించిన పలువురు జిల్లా అధికారులు సైతం త్వరలోనే పీలేరుకు రైతు బజారు మంజూరవుతుందని, తద్వారా పీలేరు ప్రాంత రైతులకు గిట్టుబాటు ధరలు లభించడమే కాకుండా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. వారి మాటలు కేవలం నీటిమూటలుగా మిగిలిపోయాయి తప్ప రైతుబజారు నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. ఈలోపు 2024లో కూటమి ప్రభుత్వం కొలువు దీరడం, పీలేరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన పురం రామ్మూర్తి సైతం రైతు బజారు ప్రతిపాదనలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగాయి. ఆయన అభ్యర్థన మేరకు మరోమారు స్థల పరిశీలన జరిపిన మార్కెటింగ్ శాఖాధికారులు ప్రభుత్వానికి ఫీజుబులిటీ రిపోర్టు సైతం పంపారు. అయినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు రైతు బజారు ఏర్పాటులో పురోగతి కనిపించలేదు. ఈ నేపథ్యంలో జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు గత నెలాఖరులో మరోమారు అదే స్థలాన్ని పరిశీలించి, అవే రూ.26 లక్షల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపామని ప్రకటించడంతో స్థానికంగా అనుమానాలు రేకెత్తించాయి.

పెరగని అంచనా వ్యయంతో అనుమానాలు

రైతు బజారు నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం అధికారులు పంపిన అంచనాల్లోనూ నాలుగేళ్లుగా మార్పు లేకపోవడం కూడా అధికారుల చిత్తశుద్ధిపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నాలుగేళ్లుగా సిమెంటు, స్టీలు, ఇసుక, కంకర, కూలీలు పెరిగిపోయిన నేపథ్యంలో అంచనాలు పెంచకుండా, పాత అంచనాలతో సకల హంగులతో రైతు బజారు ఎలా నిర్మిస్తారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే అంచనా విలువ పెంచే వారని, అలా చేయకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘనత వహించిన మార్కెటింగ్ శాఖ అధికారులు పీలేరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

రాష్ట్ర కమిషనర్‌కు పంపాం...

పీలేరులో రైతు బజారు నిర్మాణం నాలుగేళ్లుగా ఆలస్యం అవుతున్న మాట వాస్తవం. అందుకు పలు కారణాలు ఉన్నప్పటికీ ఎలాగైనా కట్టి తీరాలన్న సంకల్పంతో ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- త్యాగరాజు, ఏడీ, మార్కెటింగ్ శాఖ

ఉభయతారకంగా రైతు బజారు

పీలేరు సంత ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని అధికారులు రైతు బజారు కోసం ఎంపిక చేశారు. ప్రతి మంగళవారం వారపు సంత జరిగిన తరువాత పీలేరు పరిసర ప్రాంతాల్లోని రైతులు తమ కూరగాయాలను స్థానిక పాతబస్టాండులో రోడ్డుపై పెట్టుకుని విక్రయించుకుంటూ ఉంటారు. సరైన వసతులు లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు తమ వ్యాపారాలు సాగించుకుని ఇళ్లకు వెళ్లిపోతుంటారు. అటువంటి వారి కోసం రైతు బజారులో దుకాణాలు కేటాయిస్తే వారందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారాలు చేసుకోవచ్చని, ప్రజలకు కూడా తాజా ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లె, రాయచోటి పట్టణాల్లోని రైతు బజార్లను విజయవంతంగా నడుపుతున్న జిల్లా ఉన్నతాధికారులు అదే సూత్రాన్ని పీలేరులో కూడా అమలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రైతు బజారు కోసం ఎంపిక చేసిన స్థలం



2022లో రైతు బజారు కోసం పీలేరులో స్థలపరిశీలన చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

కళాశాల ప్రాంగణంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు



విద్యార్థినిపై దాడి

● చర్యలు తీసుకోవాలని బాధిత తండ్రి విజ్ఞప్తి

● క్రమశిక్షణా చర్యలు తప్పవు : కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్/క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో శనివారం చోటుచేసుకున్న ఘటన విద్యార్థి వర్గాల్లో కలకలం రేపింది. అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి అదే కళాశాల విద్యార్థినిపై భౌతికదాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ సంఘటనతో కళాశాల వాతావరణం ఉద్రిక్తంగా మారింది. చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకోవడంతో కోపోద్రిక్తుడై సహవిద్యార్థినిపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. అక్కడే ఉన్న తోటివిద్యార్థులు, అధ్యాపకులు వెంటనే అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కళాశాల యాజమాన్యం బాధిత విద్యార్థినిని వైద్య పరీక్షల కోసం కళాశాల మహిళా సిబ్బందితో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తన కుమార్తెపై దాడి చేసిన విద్యార్థిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన కళాశాల డైరెక్టర్ దాడికి పాల్పడిన విద్యార్థిపై తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల మధ్య వివాదాలు పెరుగుతున్న నేప థ్యంలో ఈ ఘటన మరోసారి ఆందోళన కలిగిస్తోందని ఏబీవీపీ, బీజేపీ నాయకులు తెలిపారు. కళాశాలల్లో సీసీ కెమెరాల పర్యవే క్షణ, కౌన్సెలింగ్ తప్పనిసరి చేయాలన్నారు.

దాడి చేసిన విద్యార్థిపై కేసు నమోదు

దాడి చేసిన యువకుడిపై యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు రిమ్స్ ఎస్‌ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన అబ్బవరం పీరావల్లి బీకాం కంప్యూటరు ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, అదే కళాశాలలో ఒంటిమిట్టకు చెందిన యువతి కూడా చదువుతోందన్నారు. శనివారం తరగతి గదిలో కంప్యూటరుకు సంబంధించి పేపర్లు తీసుకుంటున్న సమయంలో పీరావల్లి మరో పేపరు ఇచ్చాడని, కానీ ఆ పేపరు తనది కాదని యువతి చెప్పడంతో తీవ్ర కోపంతో తరగతి గదిలోనే విద్యార్థినిని జుట్టు లాగి చేతులు కాళ్లతో కొడుతూ దూషించాడన్నారు. ఈ నేపధ్యంలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కళాశాల డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఏబీవీపీ, బీజేపీ ప్రతినిధులు

ఎలుగుబంటి దాడిలో గాయపడిన వృద్ధుడికి ఆర్థికసాయం

సిద్ధవటం, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ వృద్ధుడు గోపాలయ్యకు కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్‌వో స్వామివివే కానంద ఆధ్వర్యంలో రూ.1.25 లక్షల సాయం శనివారం అందించారు. చలమారెడ్డి కొట్టాలు సమీపంలో గోపాలయ్య ప్రొటెక్షన్ వాచర్‌గా పనిచేశారని అటవీ అధికారులు తెలిపారు. ఇటీవల గోపాలయ్యపై ఎలుగు బంటి దాడి చేసిందని, ఈ మేరకు మానవతా దృక్పథంతో అటవీ శాఖ సిబ్బంది ఈ ఆర్థిక సాయం అందించారు.



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న డీఎఫ్‌వో వినీత్‌కుమార్

రెవెన్యూ క్రీడాపోటీలు అభినందనీయం

● ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్

● రెండోరోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ పేర్కొన్నారు. ఏడో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీలు శనివారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో రెండోరోజు కొనసాగాయి. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మాంచోఫెర్రర్‌లు పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాంచోఫెర్రర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ ప్రాంతంలో అనంతపురం వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరపడం శుభపరిణామమన్నారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా ఆటల్లో గెలవాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. క్రీడా స్ఫూర్తి ఉన్నప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలుగుతారన్నారు. క్రీడాపోటీలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఆర్డీఓ మలోలా, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట రాజేష్, రెండు జిల్లాల అధ్యక్షులు దివాకర్ రావు, మధునాయక్, ఆర్డీఓలు కేశవనాయుడు, విశ్వనాథ్‌చౌదరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, రామ్మోహన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

● వాలీబాల్ సెమీస్ పోటీల్లో విశాఖపట్నం జట్టుపై నంద్యాల గెలుపొందింది. మరో సెమీస్‌లో పార్వతీపురం జట్టుపై తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. ఫైనల్స్‌లో నంద్యాల విజేతగా నిలిచింది.

● బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో విజయనగరంపై అన్నమయ్య, తిరుపతిపై తూర్పుగోదావరి జట్టు, సీసీఎల్ఏపై కాకినాడ జట్టు గెలుపొందాయి.

● పురుషుల సింగిల్స్‌లో కడపపై ప్రకాశం, తిరుపతిపై అంబేడ్కర్ కోనసీమ జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.

● మహిళల డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై విజయనగరం, కడప జట్టుపై అనంతపురం గెలుపొంది ఫైనల్‌కు చేరాయి.

● మహిళా సింగిల్స్‌లో బాపట్లపై ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జట్టుపై కాకినాడ, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జట్లు గెలుపొందాయి.

● టెన్నీకాయిట్‌లో విజయనగరంపై విశాఖపట్నం జట్టు గెలుపొందింది. అన్నమయ్యపై చిత్తూరు, అనంతపురంపై బాపట్ల, అనకాపల్లిపై కర్నూలు గెలుపొందాయి.

● టేబుల్‌టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో అల్లూరి సీతారామరాజుపై అనంతపురం ఫారెస్ట్‌సెటిల్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి విజయం సాధించారు. డబుల్స్‌లో అల్లూరి సీతారామరాజు జట్టుపై అనంతపురం గెలిచింది.

ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టడమే

లక్ష్యంగా పనిచేయాలి

● స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు.. ధర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా

● అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం



తిరుపతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమావేశమై ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయమై సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడే విధంగా ఆ చర్యలుండాలని స్పష్టం చేశారు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు.

లోతుగా సమీక్షించిన డిప్యూటీ సీఎం

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే విషయమై పట్టుదలతో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారులతో లోతుగా సమీక్షించారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, నంద్యాల, అన్నమయ్య జిల్లాల పరిధిలో ఉన్న 17,053 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో 5,300 చదరపు కిలోమీటర్లలో ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయని అధికారులు వివరించారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని వివరించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి తిరుపతి, పీలేరు, గుంటూరు, ఆత్మకూరులలో ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఉన్నాయని వివరించారు. తరచూ శేషాచల అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్లు చేపట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నామని చెప్పారు.

20 ఏళ్లలో 14 వేల టన్నుల ఎర్రచందనం స్వాధీనం

తాము తీసుకుంటున్న చర్యల కారణంగా 2004నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదయ్యాయని, 10,450 వాహనాలను సీజ్ చేశామన్నారు. మొత్తం 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్జర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

పోరుమామిళ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు చిలమల గురయ్య (43) మృతి చెందినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలోని కాపువీధికి చెందిన గురయ్య 6వతేదీ రాత్రి 11గంటల సమయంలో తన ఇంటి ముందు కూర్చుని ఉండగా విష పురుగు అతని కుడికాలు బొటనవేలుకు కాటు వేసిందని, అయితే దానిని తేలిగ్గా తీసుకుని నిద్రపోయారన్నారు. మరుసటిరోజు కాటు వేసిన చోట కమిలి నల్లగా మారడం గమనించి వెంటనే కుటుంబ సభ్యులు కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి రక్తపరీక్షలు నిర్వహించి విషానికి విరుగుడు ఇచ్చారు. అయినా చికిత్స పొందుతున్న సమయంలో కోలుకోలేకపోవడంతో 7న మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆధిక్యతలో చిత్తూరు

● వెనుకంజలో అనంతపురం జట్టు





6వికెట్లు తీసిన రక్షణ్‌సాయి

కడప స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా శనివారం ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు కర్నూలు జట్టుపై 85 పరుగుల ఆధిక్యత సాధించింది. ఇదిలా వుండగా కడప-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం 144 పరుగుల వెనుకంజలో వుంది.

కేవోఆర్ఎం మైదానంలో..

నగర శివారు ప్రాంతంలోని కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 28.3 ఓవర్లలో 63 పరుగులకు చేతులెత్తేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు 34.3 ఓవర్లలో కేవలం 56 పరుగులకే కుప్పకూలింది. బౌలింగ్ విభాగంలో రక్షణ్‌సాయి (చిత్తూరు) 6వికెట్లు సాధించడం విశేషం. అనం తరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు ఇప్పటివరకూ 85 పరుగుల ఆధిక్యత లభించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..

నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియం లో కడప- అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప తన మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టి 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ప్రశాంత్ 41 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. దీంతో మరో 144 పరుగుల వెనుకంజలో అనంత పురం ఎదురీదుతోంది.

ఆదర్శమూర్తి భక్త కనకదాసు : డీఆర్వో



భక్త కనకదాసు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, నవంబరు 8(ఆంధ్రజ్యో తి): తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వ రకర్త అయిన భక్త కనకదాసు సమాజా న్నే కాక భగవంతున్ని సైతం మెప్పించి న ఆదర్శమూర్తి అని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు కొనియాడా రు. శనివారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ ఎస్ హాలులో జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భక్త కనకదాసు జయంత్యు త్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా డీఆర్వోతో పాటు ఎస్డీసీ వెంకటపతి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భక్త కనక దాసు చిన్న వయసులోనే నరసింహ స్తోత్రం, రామ ధ్యానమంత్రం, మోహన తరంగిని అనే కవిత్వాలను రచించార న్నారు. సాధారణ కన్నడ భాషల్లో కనక దాసు ఎన్నో కీర్తనలు రచించి ఆలపిం చారు. కీర్తనలు రచిస్తూ వేదాంతాన్ని అభ్యసించి గొప్ప కృష్ణ భక్తుడిగా పేరు గడించారన్నారు. ఆయన సైన్యంలో కూడా పని చేసినట్లు కీర్తనల ద్వారా తెలుస్తోందన్నారు. అలాగే కర్ణాటక సంగీతం కోసం ఎనలేని సేవలు చేశారన్నారు. అంతకుముందు డీఆర్వో భక్త కనకదా సు చిత్ర పటానికి పూలమాల వేసి ని వాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, బీసీ కార్పొరే షన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాత టైం టేబుల్ ప్రవేశ పెట్టాలి

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పాత టైం టేబుల్ ప్రవేశపెట్టాలని ఎస్టీయూ(గురుకులవిభాగం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీయూ భవనంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అంబేద్కర్ గురుకులాల ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ గురకులాల్లో 7.45 నిమిషాల నుంచి 3 గంటల దాకా టైం టేబుల్ ప్రస్తుతం అమల్లో ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని గురుకులాల్లో క్వార్టర్స్ లేవని కావున పాత టైం టేబుల్ 8.45 నిమిషాల నుంచి నాలుగు గంటల వరకు అమలు చేసినా స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నేతలు శ్రీనివాసులు, మల్లీశ్వరి, గురుకులాల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ నేతలు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



మృతి చెందిన శరవణ్

పులివెందుల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణ సమీపంలోని గోవిందరాజ టెక్స్‌టైల్స్‌లో తమిళనాడు కు చెందిన శరవణ్ (35) అనే కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శుక్ర వారం అర్ధరాత్రి శరవణ్ టెక్స్ టైల్స్‌లోని ఓ గదిలో ఉరి వేసు కొని మృతి చెందినట్లు తెలిసింది. కానీ ఈ విషయం బయటకు రాకుండా గోవిందరాజ టెక్స్‌టైల్స్ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. శనివారం ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొ ని వివరాలు సేకరించినట్లు తెలిసింది. దీనిపై మృతుడి బంధువు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ప్రజాదర్బార్‌లో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి



అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కలికిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించక ప్రజల్ని పదే పదే తిప్పుకోవడం ఎంత మాత్రం సమంజసమని పలువురు అధికారులపై ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నగరిపల్లెలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రజలు పోటెత్తారు. చిన్నపాటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు క్యూ కట్టడాన్ని గుర్తించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను అధికారులకు ఫోనులో తెలియజేసి అధికారుల నిర్లక్ష్యం గురించి నిలదీశారు. గ్రామ, మండల స్థాయి అధికారులు సులభంగా పరిష్కరించగలిగే వాటిని తన వరకూ తీసుకు వచ్చే వరకూ అలసత్వం వహించడం తగదని చెప్పారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల కోసం రూ.కోట్లు విడుదల చేస్తున్నా అవి అందుకోలేని అర్హుల గురించి నిర్లక్ష్యం చేయడం బాధ్యతారాహిత్యమని మందలించా రు. భూముల సమస్యలు, విద్యుత్, తాగునీరు లాంటి సమస్యలు కూడా తన వరకూ రప్పించడాన్ని కిశోర్‌కుమార్ రెడ్డి తప్పుబట్టారు. ప్రజా దర్బార్‌కు ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నాటి ఉద్యమ ఫలితమే నేడు జిల్లా సాకారం

● ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నాటి ఉద్యమాల ఫలితమే నేడు మదనపల్లె జిల్లా సాకారమవుతోందని ఏపీఎస్ ఆర్టీసీ1,2డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయకుండా ప్రజల ఆకాంక్షలను పక్కన పెట్టితీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. మదనపల్లె జిల్లా కోసం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. ఇందులో టీడీపీ నేతలు భాగస్వామ్యం అయ్యారని గుర్తు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులను బనాయించిందన్నారు. కాగా యువగళం పాదయాత్రలో నారా లోకేష్, ఎన్నికల ముందు మదనపల్లె పర్యటనలో చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి వచ్చిన అనంతరం మదనపల్లె జిల్లా కేంద్రం ప్రకటించడం హర్షించదగ విషయమన్నారు.

దీపోత్సవం వ్యాఖ్యాతగా చంద్రశేఖరరావుకు ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కడపకు చెందిన ఆధ్యాత్మిక రచయిత, ప్రవచనకర్త డాక్టర్ ఎంఎల్ఎన్ చంద్రశేఖర్‌రావుకు శ్రీశైలంలో నిర్వహించనున్న దీపోత్సవ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించాలని శనివారం శ్రీశైలం ఆలయ కార్యనిర్వహణాధికారి నుంచి ఆహ్వానం అందింది. ఈనెల 10వ తేదీన శ్రీశైలం ఆలయ పుష్కరిణి వద్ద జరిగే లక్ష దీపోత్సవం, దశవిధ హారతుల కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా కోరారు. పెండ్లిమర్రి ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న చంద్రశేఖరరావు 40 ఆధ్యాత్మిక గ్రంథాలు, 12 పాఠ్యపుస్తకాలు రచించారు. తిరుమల, శ్రీశైలం వంటి పవిత్ర క్షేత్రాల్లో ప్రవచనాలు, వ్యాఖ్యానాలు చేసిన ఆయనకు ఈ ఆహ్వానం రావడం పట్ల కడప సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

బహిరంగ విచారణకు సిద్ధమా ?

కోళ్లబైలు అభివృద్ధిపై ఆరోపణలు తగదు
టీడీపీ ఇన్‌చార్జ్ రాటకొండ శ్రీనివాసులు సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న రాటకొండ శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోళ్లబైలు-2 పంచాయతీ అభివృద్ధిపై బహిరంగ విచారణకు సిద్ధమా అని కోళ్లబైలు టీడీపీ ఇన్‌చార్జి రాటకొండ శ్రీనివాసులు సవాల్ విసిరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ చేస్తున్న ఆరోపణల్లో పస లేదని, కోళ్లబైలులో వేసిన సీసీ రోడ్డు వైసీపీ హయాంలో మంజూరైనదనడంలో వాస్తవాలు లేవన్నారు. ఇటీవల కోళ్లబైలులో పర్యటించిన నిస్సార్‌అహ్మద్ అక్కడ వేసిన సీసీ రోడ్డును చూసి అది వైసీపీదేననడం విడ్డూరంగా ఉందన్నారు. 2025 ఫిబ్రవరిలో డీఎఫ్‌ఎఫ్ నిధులతో మంజూరైన రోడ్డును, వైసీపీ హయాంలో మంజూరైందని పీఆర్ ఏఈగా పనిచేసిన నిస్సార్ అహ్మద్ చెప్పడం సిగ్గుచేటన్నారు. ఏడాదిన్నరలో కోళ్లబైలు-2 పంచాయతీలో 39 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.5 కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కోళ్లబైలు కాలనీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఆధ్వర్యంలో చేపట్టిన మురుగునీటి కాల్వలు, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణాలు కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. గ్రామ సచివాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోల పక్కన ఎంపీ మిధున్ రెడ్డి ఫొటో పెట్టాలని నిస్సార్ అనడం హాస్యాస్పదమని హేళన చేశారు. కోళ్లబైలు అభివృద్ధిపై నిస్సార్ బహిరంగ విచారణకు వస్తే తాము సిద్ధమే అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో కోళ్లబైలు టీడీపీ నేతలు బి.శేఖర్, సీబీఎన్ రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

నాసిరకం నిర్మాణాలను అడ్డుకుంటాం

టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ



మట్టి ఇసుకను చూపిస్తున్న వెంకటరమణ

నిమ్మనపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న వివిధ రకాల నాసిరకం నిర్మాణాలను అడ్డుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. నిమ్మనపల్లి, వెంగంవారిపల్లి పంచాయతీల్లో చేపట్టనున్న సీసీ రోడ్లకు తోలిన మెటీరియల్స్‌ను శనివారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణానికి ఇసుక బదులు మట్టితోలి రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ కోవర్టుగా చెప్పుకొనే శ్రీనివాసులురెడ్డి వైసీపీ ప్రభుత్వంలో సచివాలయాలు రోడ్ల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అలాంటి వ్యక్తి కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే రాజకీయ పలుకుబడితో దాదాపు రూ. కోటి మేరకు పనులు తెచ్చుకున్నాడంటే నమ్మశక్యంగా లేదన్నారు. ప్రస్తుతం వెంగంవారికురవపల్లి, సింగంవారిపల్లి, మండెంవారిపల్లి, బాలినాయునిపల్లిలో సీసీ రోడ్లు నిర్మించేందుకు కంకర, ఇసుకను తోలి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా వున్నట్లు తెలిపారు. అయితే ఇక్కడ అతని నిజ స్వరూపం బట్టబయలైందని ఇసుకకు బదులు మట్టిని తోలి నాసిరకంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో చెక్ డ్యాంలు, వంతెనలు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు, మురుగు నీటి కాల్వలు ఒక టీమిటి అన్ని పనులూ నాసిరకంగా చేపట్టడంతో కొద్దిపాటి వర్షానికే కూలే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఇంతగా నాసిరకం పనులు చేపడుతున్నా మళ్లీ అతనికే పనులు అప్పగించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిర్మాణాలను అడ్డుకుని పార్టీ దృష్టికి తీసు కెళాతామన్నారు. పీఆర్ డీఈ శివప్రసాద్ వివరణ ఇస్తూ ఆయన చేపట్టిన నాసికరం పనులకు బిల్లులు చెల్లించమన్నారు. కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి తోలిన ఇసుకను తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు.

ఆ మలుపు ప్రమాద పిలుపు

సూచిక బోర్డులేని ప్రమాదకర మలుపు



సబ్‌జైలు నిర్మాణాల వద్ద ప్రమాదకర మలుపు

వాల్మీకిపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ మలుపు ప్రమాదాలకు పిలుపని, ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కనీసం ప్రమాదకర మలుపు ఉన్నట్లు సూచక బోర్డుకూడా లేదు.

పట్టణ సమీపంలోని నూతన సబ్‌జైలు భవనాల అత్యంత సమీపాన ఉన్న మలుపు ప్రమాదకరంగా తయారైంది. మలుపు వద్ద చెట్లు ఏపుగా పెరిగి ఇరువైపులా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడవు. నిత్యం ద్విచక్రవాహనాలు మొదలుకుని ఆటోలు, కార్లు, బస్సులు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇదే మలుపు ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు కూడా జరిగాయి. ఈ మలుపులో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్ కూడా వెలగక పోవడంతో ఏ నిముషం ప్రమాదం చోటు చేసుకుంటుందో అన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా వాహన చోదకులు కూడా ఈ మలుపు సమీపించగానే అప్రమత్తంగా లేకుంటే ప్రమాదమే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద చెట్లు తొలగించి సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని, కనీసం సూచిక బోర్డు అయినా ఏర్పాటు చేయాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

ధర్మపథంలో శనీశ్వరుడికి మహాతైలాభిషేకం



వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో శనివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ దార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజలు చేయించారు. ఆలయంలోని శనీశ్వర స్వామి వారికి మహాతైలాభిషేకం, ప్రత్యేకాలంకరణతో పూజలు జరిగాయి. అనంతరం హోమాధి కార్యక్రమాలు పూర్తి చేసి భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై మెరుగైన చర్యలు

వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో గృహ వినియోగదారులకు, రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండే దిశగా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై సమస్యగా మారిన చెట్టు కొమ్మలను తొలగించారు. వర్షాల దృష్ట్యా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా లోఓల్టేజీ సమస్య రాకుండా చూడడానికే ముందస్తు సమాచారం అందిస్తూ విద్యుత్ అంతరాయం సమయాన సమస్యలు పరిష్కరిస్తూ, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు, రైతులు ఏవేని సమస్యలున్నా నేరుగా కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లైన్‌మెన్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరండి

● జనసేన నేత రాందాస్‌చౌదరి పిలుపు

మదనపల్లె టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి రైతులందరూ తరలిరావాలని జనసేన మదనపల్లె ఇన్‌చార్జి గంగారపు రాందాస్‌చౌదరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మార్కెట్‌యార్డులో కమిటీ చైర్మన్ జంగాల శివరామ్‌తో కలిసి రాందాస్‌చౌదరి విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన మార్కెట్ కమిటీ పాలక వర్గం ప్రమాణం చేస్తుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నారన్నారు. మదనపల్లె జిల్లా కావాలనే ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్ మాట్లాడుతూ తమ ప్రమాణ స్వీకారానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్ హాజరవుతున్నారని, ఈ కార్యక్రమాన్ని కూటమి నేతలు సమష్టిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డెప్పనాయుడు, అడపా సురేంద్ర, జేకే వర్మ, సనావుల్లా, లక్ష్మీపతి, బర్నేపల్లె రవి, తోట కల్యాణ్, జగదీశ్‌బాబు, ప్రదీప్, మోహన్, అర్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పెద్దపూజ

పుష్పపల్లకిపై నగరోత్సవం



అయ్యప్పస్వామి నగరోత్సవం

వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోనేటివీధిలో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం పెద్దపూజ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, ప్రత్యేకాలంకరణలు చేశారు. అయ్యప్పమాల ధారుల నడుమ హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్పస్వాముల ప్రతిమలను పుష్పపల్లకిలో విశేషాలంకరణతో నగరోత్సవం చేశారు. అయ్యప్ప స్వాముల నగర సంకీర్తనలు, నామస్మరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం ఆలయంలో భక్తుల భజనలు, అంబుళం పూజ, పడిపూజ కార్యక్రమాలు కన్నుల పండువగా సాగాయి. ఈసందర్భంగా విశేష సంఖ్యలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, స్థానిక నేతలు, గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మాకాలమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గోవిందు వంశస్థులు

ములకలచెరువు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గూడుపల్లె క్రాస్ సమీపంలో కొత్తగా నిర్మించిన మాకాలమ్మ, సుబ్రమణ్యేశ్వర ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గోవిందు హరినాధరెడ్డి, శ్యామల దంపతులు సహాయ, సహకారాలతో ఆలయాన్ని నిర్మించి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నారు. గోవిందు వంశస్థులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలో గణపతి పూజ, నవగ్రహారాధన, మహాలక్ష్మీ పూజ తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం కూడా ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. కార్యక్రమంలో గోవిందు వంశస్థులు మాకిరెడ్డి, శంకర్‌రెడ్డి, రమనారెడ్డి, నరసింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్ రావు



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పీలేరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్, హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్ తెలిపారు. శనివారం నూతనకాల్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్తీక వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విధిగా రెండు మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు నిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, తద్వారా భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని వివరించారు. అడవులు ధ్వంసం చేయడం వల్ల వాతావరణలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. వాతావరణలో చోటుచేసుకుంటున్న పెను మార్పులను అరికట్టాలంటే విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ ప్రభావం ప్రజల జీవన విధానంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములను చేయడం కోసం తరచూ మొక్కలు నాటుతున్నామన్నారు. బీటు అధికారి జగదీశ్, రెడ్డిఆసియా, బీ. చంద్రకళ, శ్రీనివాసన్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసిన కొండ్రెడ్డి



ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డితో మద్దిరెడ్డి కొండ్రెడ్డి, టీడీపీ నేతలు

తంబళ్లపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డిని శనివారం పీలేరులోని ఆయన స్వగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తంబళ్లపల్లె టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలిపారు. టీడీపీ నేతలు ప్రసాదరెడ్డి, రమణ, నాగార్జున, షామీర్‌బాష, మహబూబ్ బాష, మునాఫ్, షఫీవుల్లా, రమణారెడ్డి, రమణ, శ్రీరాములు పాల్గొన్నారు.

డిసెంబరు 5,6 తేదీల్లో పాలిటెక్నిక్ అధ్యాపకులకు వర్క్‌షాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీలో డిసెంబరు 5,6న పాలిటెక్నిక్ అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ తిరుపతి రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ పేర్కొన్నారు. అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీ సిబ్బంది ఆధ్వర్యంలో తిరుపతిలో పాలిటెక్నిక్ అధ్యాపకుల వర్క్‌షాప్ నిర్వహణకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలకు అక్రిడిటేషన్ గుర్తింపు ఎంతో ముఖ్యమన్నారు. దీని ద్వారా నాణ్యమైన విద్య, పరిశ్రమలకు తగ్గట్టుగా విద్యార్థులకు నైపుణ్యాలను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్మల్‌కుమార్ ప్రియ, శ్రీనివాసులు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమన్నకు ప్రత్యేక పూజలు

కలకడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, తమలపాకుల హారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి అభిషేకం, పూజలు చేశారు. సమీప గ్రామాల ప్రజలు కొబ్బరి కాయలు సమర్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నృసింహుడికి....



గుర్రంకొండ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి అర్చకులు పూజలను నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఏపీయూఎస్ సమావేశం

పీలేరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పీలేరులో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీసీపీఎస్ ఈఏ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. తిరుపతి రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని ఏపీయూఎస్ సభ్యులు తప్పక హాజరవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పీలేరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పీలేరు-చిత్తూరు రోడ్డులోని ఐటీఐ వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పీలేరు ఇందిరమ్మ కాలనీ వాసి మునీశ్వర వ్యక్తిగత పనుల నిమిత్తం పీలేరుకు వస్తుండగా, కల్లూరు వైపు వెళుతున్న పీలేరు రాజీవ్ నగర్ కాలనీ వాసి యాసిన్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో స్థానికులు పోలీసులు, 108కు సమాచారం అందించారు. పోలీసులు క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

10న సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామాలయంలో ఈనెల 10న సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు పేర్కొన్నారు. అలాగే సాయంత్రం సీతారామలక్ష్మణుల నగరోత్సవం నిర్వహిస్తారన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొండయ్యగారిపల్లి పంచాయతీలో చిలకల రామకృష్ణారెడ్డి ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేసి ఆరుగురు పేకాట రాయుళ్లు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2300లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠాలు చదివించండి : ఎంఈఓ

పెద్దమండ్యం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రోజూ విద్యార్థులతో పాఠాలను చదివించాలని ఎంఈఓ గాజుల రామకృష్ణ - 2 పేర్కొన్నారు. ఎన్‌ఓ పల్లి పంచాయతీ గౌనివారిపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలను చదివించారు. చేతి రాత పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థుల్లో విద్యా పరిజ్ఞానాన్ని కోసం పలు ప్రశ్నలు అడిగారు. విద్యా బోధన సామర్థ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సబ్జెక్టు పాఠశాలను ఆయా ఉపాధ్యాయులు విద్యార్థులతో చదివించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. గ్రామంలో మురుగు కాల్వలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

ఎన్‌హెచ్‌పై పొంగి పొర్లిన జలాలు

● రహదారిపై వాహనాలకు నిషేధం



ఎక్స్‌కవేటర్‌తో నీటిని తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కురబలకోట కనసానివారిపల్లె సమీప చెరువులోని నీరు రహదారిపై పొంగి పొర్లాయి. కనసానివారిపల్లె పంచాయతీ వద్ద రహదారి పక్కనే ఉన్న చెరువులోకి నీరు చేరడంతో నిండి పొంగిపొర్లింది. దీంతో రోడ్డులో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంపీడీఓ గంగయ్య, ఇరిగేషన్ అధికారులు, ఎస్‌ఐ మధు రామచంద్రుడు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నీటిని మరోమార్గంలో తరలించడానికి చర్యలు చేపట్టగా నాయనివారిపల్లె గ్రామస్తులు వ్యతిరేకించడంతో వారికి నచ్చజెప్పి నీటిని మరోమార్గంలో ఎక్స్‌కవేటర్‌తో తరలించారు. కాగా రహదారిపై రాకపోకలను నియంత్రిస్తూ నిలుపుదల చేశారు.

సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ



పశువుల దాణాను పాడి రైతులకు పంపిణీ చేస్తున్న ఏడీ సుమిత్ర

తంబళ్లపల్లె, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణాను పంపిణీ చేస్తోందని పశు వైద్యశాఖ ఏడీ సుమిత్ర అన్నారు. శనివారం తంబళ్లపల్లె పశు వైద్యశాలలో ఏడీ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, సిబ్బంది కిరణ్ కూటమి నేతలతో కలిసి దాణా పంపిణీని ప్రారంభించారు. మండలానికి 37.5 టన్నులు(50 కిలోలవి, 750 బస్తాలు) పశువుల దాణా వచ్చిందన్నారు. గుండ్లపల్లె, కుక్కరాజుపల్లె, కోటకొండ, కన్నెమడుగు, కోసువారిపల్లె, గోపిదిన్నె పశువైద్య కేంద్రాల్లో పశువుల దాణా అందుబాటులో ఉందన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డుతో వారి వారి గ్రామాల్లోని పశువైద్యశాలల్లో సిబ్బందిని సంప్రదించి పశువుల దాణా పొందవచ్చన్నారు. పంపిణీ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, ఎర్రసానిపల్లె టీడీపీ గ్రామాధ్యక్షుడు రామ్మూర్తి, పశువైద్య సిబ్బంది కిరణ్, పాడి రైతులు పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యదర్శికి ఘన సన్మానం



గంగాధరాన్ని సన్మానిస్తున్న డిప్యూటీ డీఈఓ లోకేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు

పీలేరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) కార్యదర్శిగా నియమితులైన తాటిపర్తి గంగాధరాన్ని శనివారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఆర్‌సీలో జరిగిన కార్యక్రమంలో పీలేరు ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ వేపులబైలు పంచాయతీ జంగంపల్లె జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గంగాధరానికి జిల్లా పదవి లభించడం పీలేరు మండలానికి గర్వకారణమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఆయనను సత్కరించారు. హెచ్‌ఎంలు శోభారాణి, రెడ్డప్ప, సురేంద్రనాథ్, నాగరత్నమ్మ, కిరణ్మయి, జైపాల్ రెడ్డి, రేణుక, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, అశోక్, శ్వేత, తదితరరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు

మదనపల్లె అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ అంగన్వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరి, కోశాధికారిగా గౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓబులమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాగ్యలక్ష్మీ, ఉపాధ్యక్షురాలు శ్రీవాణి, ఈశ్వరమ్మ, చల్లమ్మ, సంపూర్ణ, సహాయ కార్యదర్శులుగా గంగాదేవి, భైరవేశ్వరి, ప్రమీల, వసంత ఎన్నికయ్యారు. పరిశీలకులుగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సంకటహర చతుర్థి వ్రతం



ప్రత్యేక కలశాలు ఏర్పాటు చేసిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్ప సముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శనివారం కార్తీకమాసం పురస్కరించుకుని సంకటహర హర చతుర్థి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు గణపతి హోమం, అభిషేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం చేపట్టారు. వీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చారు.